## కంకర క్రషర్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

**హత్నూర జూన్ 10,ప్రభాతవార్త:** హత్నూర గ్రామంలోని కంకర క్రషర్ అక్రమాలను ఆరికట్టాలని హత్నూర గ్రామస్థులు సోమవారం సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేశారు.హత్నూర తాజామాజీ సర్పంచ్ వీరస్వామీగౌడ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పొట్లగల్ల ప్రవీణ్,ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షులు నందిగామ్ శ్రీనివాస్,మత్స శాఖ సంఘం డైరెక్టర్ గడ్డమీది అంజనేయులు తదితరలు పిర్యాదు చేశారు.మైనింగ్ కొరకు ప్రభుత్వం ఐదు హెక్టార్లలో అనుమతులు ఇస్తే, సుమారు 30ఎకరాలలో తవ్వకాలు సాగిస్తూన్నారని పిర్యాదు చేసిన తాజా మాజీ సర్పంచ్ వీరస్వామీగౌడ్ అన్నారు.వేబిల్లులు వినియోగించడంలేదని, అధికలోడుతో వాహనాలలో కంకర తరలిస్తున్నారని, బ్లాస్టింగ్‌లో నిభంధనలు పాటించడంలేదని, అక్రమ పద్దతిలో లీజు రినివల్ చేసుకున్నారని, దానిని రద్దు చేయాలని కోరారు.హత్నూర కంకర క్రషర్ అక్రమాలపై పూర్తి విచారణజరిపి శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు. కంకర క్రషర్‌వల్ల హత్నూర గ్రామస్థులతో పాటు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అనుమతులు రద్దుచేయాలని కోరారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

## బస్సును ఢీకొన్న బైక్..ఒకరి మృతి

### మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

**అక్కన్నపేట, జూన్ 10, ప్రభాతవార్త :** వ్యవసాయపనుల నిమిత్తం పొలం పనులకు బైక్‌పై భర్తతో కలిసి వెళుతూ పంతులుతండాకు చెందిన వివాహిత అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సోమవారం అక్కన్నపేట మండలంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్న పేట మండలం పంతులుతండకు చెందిన కరోంటోతు రాజునాయక్, భార్య కవితతోపాటు బంధువు స్వరూపను ద్విచక్రవాహనంపై తీసుకువెళుతుండగా ప్రమాదవశాత్తూ బస్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కవిత అక్కడికక్కడే మృతి చెందగా రాజునాయక్, స్వరూపలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే వరంగల్‌లోని ఎంజిఎం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కన్న పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనకు సంబంధించి అక్కడి గిరిజనతండాకు చెందిన ప్రజలు తమకు న్యాయం కావాలని డిమాండ్ చేస్తూ ఆందోళనణ చేపట్టారు. హుస్నాబాద్ బస్‌డిపో మేనేజర్ సంఘటనా స్థలానికి వచ్చి న్యాయం జరిగిలే ప్రకటన చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిసు_్తన్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

## ప్రజావాణి దరఖాస్తులు స్వీకరణ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్య నిస్తూ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను అదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమ వారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాలకు ఓర్చి వస్తారని అధికారులు శాఖల వారిగా స్వీకరించిన దర ఖాస్తులపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలన్నారు. దరఖాస్తు లను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కార మార్గం చూపాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్‌డిఎ పిడి జయదేవ్ అర్యా, వివిధశాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**మెదక్ జిల్లాలో...**



ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, జూన్10 ప్రభాతవార్త:** ప్రజావాణికి వచ్చే అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్య లపై వచ్చిన 91 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ప్రజా వాణికి వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి వచ్చిన వారు మళ్లీ పదే పదే రాకూడదని, అర్హతను బట్టి వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సమస్య పూర్వపరాలను వివరిం చాలన్నారు. అప్పుడే ప్రజావాణిపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని చెప్పారు. ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు. భూ సమస్యలపై 30, పెన్షన్ గురించి 10, డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం 3, ఉద్యోగాల కోసం 2, ఇతరాలు 46, మొత్తం 91 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పోలీసు ప్రధాన కార్యాలయంలో...**



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ బాలస్వామి

**సంగారెడ్డి బ్యూరో, జూన్10 ప్రభాతవార్త:** ఫిర్యాదుదారుల సమస్య లను వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బాలస్వామి అన్నారు. సోమ వారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ బాలస్వామి ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలు విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మండల హైదర్‌గూడ గ్రామానికి చెందిన పిట్ల చంద్రకళ తన అత్తమామ లకు ముగ్గురు సంతానం అని, భర్త అందరికంటే చిన్నవాడని, తన భర్త సంవత్సరం క్రితం చనిపోయాడని, తన భర్త తాత గారి వారసత్వంగా సంక్రమించిన భూమి మా మామగారు మరణించిన తరువాత మా అత్త రిజిస్ట్రేషన్ చేసుకుందని, ఈ భూమి సర్వే నెంబర్ 569 లో 0.2700 గుంటలు ఉండగా రెండవ కుమారుడికి 0.8000 గుంటలు, పెద్ద కుమారుడికి 0.0600 గుంటలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, తన భర్త బ్రతికున్నప్పుడు నా వాటా నాకు సరిగ్గా ఇస్తామని నమ్మించి తాను చని పోయిన తరువాత మోసగించారని, వారసత్వంగా మాకు రావాల్సిన భూమిని ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తూ నన్ను చంపుతామని బెదిరిస్తూ భయ భ్రాంతులకు గురి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా, చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని తూప్రాన్ ఎస్ఐకి సూచించారు. అలాగే రామాయంపేట పట్టణానికి చెందిన మహమ్మద్ రఫీ తమకు అక్కన్నపేట గ్రామంలో గల ఫక్కిర్ సాబ్ దర్గా వద్ద ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి వంతు ఉంటుందని, అక్కడ ఈ నెల 23న సందల్ ఉన్నదని, కొంత మంది వ్యక్తులు పాత కక్షలు మనసులో పెట్టుకొని ఏమైనా చేస్తారని ఫిర్యాదు చేయగా చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని రామాయంపేట ఎస్ఐకి సూచించారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

**సంగారెడ్డి బ్యూరో, మే 10, ప్రభాతవార్త:** ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుదారుల నుండి పిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదు లను పెండింగ్‌లో పెట్టకుండా సత్వర పరిష్కారం చేయాలని అదేశిం చారు. ఎన్నికల కోడ్ అనంతరం నిర్వహించిన మొదటి ప్రజావాణికి ప్రజలనుండి అధిక సంఖ్యలో ఫిర్యాదు వచ్చాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబందించినవి 18, డిఆర్‌డిఓకు సంబందించినవి 4, పంచా యతీరాజ్ శాఖ 5,ఇతరశాఖలకు సంబందించినవి 21 దరఖాస్తూలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణిలో కలెక్టర్‌తో పాటు, ఆదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డిఆర్ఓ పద్మజరాణి పాల్గొన్నారు.

## నూరు శాతం అక్షరాస్యతే లక్ష్యంగా పనిచేయాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, జూన్10 ప్రభాతవార్త:**

జిల్లాలో 100 శాతం అక్షరాస్యత లక్ష్యంగా పని చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో త్వరలో ప్రారంభం కానున్న న్యూ ఇం డియా లిటరసీ కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో 100 శాతం అక్షరాస్యతలో నిలపడంలో అధికారులు భాగస్వామ్యంకావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 15 సంవత్సరాలు నిండిన వారినుండి ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం రావాలన్నారు. మెదక్ జిల్లాలో గతంలో ఉన్న అక్షరాస్యత కంటే మెరుగైన అక్షరాస్యత నమోదు చేసి రాష్ట్రంలో అక్షరాస్యతలో మొదటి స్థానంలో నిలపాలన్నారు. దీని కోసం గ్రామ స్థాయిలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేయాలని, గ్రామ మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలని పిలుపు నిచ్చారు.ప్రతివ్యక్తికి చదవడం,రాయడం రావాలన్నారు.

**పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి...**

ఈ నెల 12వ తేదీన పాఠశాలల పునః ప్రారంభం నాటికి పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, పాఠ





మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

శాలల్లో అన్ని పనులు పూర్తి చేయాలని, పాఠశాల్లో ఉన్న స్టాక్‌ను చెక్ చేసుకోవాలని, పాడైపోయిన స్టాక్‌లు ఏమైనా ఉంటే తీసేయాలన్నారు. మధ్యాహ్న భోజన కార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఏకరూప దుస్తులు కుట్టడం పూర్తి చేయాలని, 12వ తేదీన విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థులకు టెక్స్ట్‌బుక్స్, నోట్ బుక్స్ త్వరగా అందించాలని చెప్పారు. అలాగే తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని, అంగన్‌వాడీలలో కొత్త విద్యార్థు లను నమోదు చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ పాఠ శాల పూర్తయిన విద్యార్థులను ప్రాథమిక పాఠశాల్లో చేర్పించాలన్నారు.రైతులకు ఎలాంటి ఎరువుల కొరత లేదని, అన్నిరకాల ఎరువులు,విత్తనాలు అందుబాటు లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి రాధాకిషన్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైల్వేలైన్ నిర్మాణానికి భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్ట రేట్‌లో సోమవారం రైల్వేశాఖ అధికారులతో మనో హరాబాద్-కొత్తపల్లి రైల్వే నిర్మాణంలో భాగంగా చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై నిర్వహించిన సమా వేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నకోడూరు మండల పరిధిలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు, మాచాపూర్, గంగాపూర్, విఠలాపూర్ గ్రామాలు, నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాలలో 25 ఎకరాల 30 గుంటల భూమి ఇంకా రైల్వే నిర్మాణానికి సేకరించాల్సి ఉంద న్నారు. ఆయా మండలాల తహసీల్దార్లు, ఆర్డీఓ ప్రత్యేక చొరవ తీసుకొని త ్వరగా భూసేకరణ పూర్తిచేసి రైల్వే అధికారులకు అప్పగించా లన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస ్‌రెడ్డి, ఆర్డీఓ సదానందం, రైల్వే అధికారి జనార్దన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

**శిశుమరణాలు జరగకుండా చూడాలి**



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

జిల్లాలో శిశు మరణాలు సంభవించకుండా అంకి తభావంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి ఆరోగ్యశాఖ అధికారులను అదేశించారు. జిల్లా కలెక్టర్‌లో చైల్డ్ డెత్ రివ్యూ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంచి వైద్య సౌక ర్యాలు ఉన్న జిల్లాలో 2024 జనవరినుంచి మార్చి వరకు 3 నెలలలో 33 మంది శిశు మరణాలు సంభవించడంపై కలెక్టర్ అందోళన వ్యక్తం చేస్తూ ఇక నుంచి జిల్లాలో శిశు మరణాలు సంభవించకండా వైద్యాధికారులు అప్రమత్తంగా అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు.

గర్భిణి స్త్రీ నమోదు దగ్గర నుంచి ప్రసవం అయ్యే వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.సమావేశంలో డిఎంఅండ్‌హెచ్ఓ పుట్ల శ్రీనివాస్, డిప్యూటి డిఎంఅండ్‌హెచ్ఓ శ్రీనివాస్, ప్రభాకర్, డాక్టర్లు విజయరాణి, వేణు, అంజలి, రజని తదితరులు

## పెండింగ్ పనులు పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలి

### సమీక్ష సమావేంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

**సంగారెడ్డి బ్యూరో మే 10,ప్రభాతవార్త:** పెండింగ్ పనులను పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రారంభంకాని అభివృద్ది పనులు,ఉపాదిహమీ పనులు,పెండింగ్‌లో ఉన్న పనులు మొదలి పెట్టాలని అదేశించారు.ప్రారంభోత్సవాలకు, శంఖుస్థాపనలకు స్టోన్లు సిద్దంచేయాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ నెల 12న పునఃప్రారంభమయ్యే పాఠశాలలకు హజరయ్యే విద్యార్థులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ అజ్ఞాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాక్రమంలో ఆదనపు కలెక్టర్ చంద్రశేఖర్,డిఆర్ఓ పద్మజరాణిలు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి బడిబాట..**

సంగారెడ్డిలోని హస్టల్‌గడ్డ ప్రాథమిక పాఠశాల ఊర్దు మీడియం పాఠశాల, ఇస్మాయిల్‌ఖాన్‌పేట ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం బడిబాట కార్యాక్రమం నిర్వహిస్తున్నదని అన్నారు. కార్య క్రమాన్ని విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతి నిధులు చిత్తశుద్దితో పనిచేయాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి కోరారు.బడిబాట కార్యక్రమంలో ఇప్పటివరకు 1వ తరగతిలో 791 మంది విద్యార్థులు,రెండవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు585 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరినట్లు తెలిపారు.

## టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతి

- అవినీతి అధికారులపై విచారణ చేయాలి
- డబుల్ బెడ్ రూం కాలనీలో ఇళ్ల అమ్మకాలపై చర్యలు తీసుకోవాలి
- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

సిద్దిపేట మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అధికారులు పూర్తిగా అవినీతికి పాల్పడుతున్నారని.. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సభ్యులు ధర్మవరం బ్రహ్మం, నాయకం లక్ష్మణ్, గాదగోని వినోద్‌గౌడ్ తదితరులు డిమాండ్ చేశారు. సిద్దిపేట మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ కడవేర్గు మంజులరాజనర్సు అధ్యక్షతన సోమవారం మున్సి పల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వ హించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారి అవినీతికి పాల్పడుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తు న్నారని మండిపడ్డారు. సెల్లార్ల పేరిట అనుమతులు తీసుకుని వ్యాపార సముదాయాలు నిర్మించిన టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని ధ్వజమె త్తారు. ఎల్ఆర్ఎస్ కింద డబ్బులు చెల్లించిన వారికి ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వకుండా 59 జీవో కింద మాత్రం అందినకాడికి దండుకొని ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని ఆరోపిం చారు. ఇంటి నిర్మాణాలకు అనుమతులు వచ్చిన తర్వాత నిబంధనల ప్రకారం నిర్మాణం చేపడుతున్నారా లేదాఅని టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసిన పాపాన పోవడం లేదన్నారు. నిబంధనలకు విరుద్దంగా నిర్మా ణాలు చేపడుతున్నవారిపై చర్యలు తీసుకోకుండా అందినకాడికి దండుకొని చూసిచూడనట్లు వ్యహారిస్తు న్నారని ఆరోపించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమి షనర్ పనితీరు ఏమాత్రం బాగోలేదని ఆయనను వెంటనే తిరిగి పంపించాలని సభ్యులు డిమాండ్ చేశారు. పేదల కోసం నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్ రూం కాలనీలో అమ్మకాలు జరుగుతున్నాయని వెం టనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు, ఫోర్జరి సంతకాలు సృష్టించి డబుల్ బెడ్‌రూం ఇళ్లను అమ్మకానికి పెడుతున్నారని వారిపై విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.మున్సి పల్‌చైర్మన్ మంజులరాజనర్సు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూంలలో ఇండ్ల అమ్మకాలపై విచారణ చేపట్టి బాధ్యులను గుర్తించాలని అధికారులను అదేశించారు. డబుల్ బెడ్‌రూం అమ్మకాలలో తప్పుచేస్తే సహించేది లేదన్నారు. పట్టణంలో నిర్మిస్తున్న భవనాలు అను మతులు తీసుకున్న విధంగా నిబంధనల ప్రకారం నిర్మిస్తున్నారా లేదా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలన్నారు. నిబంధన లకు విరుద్దంగా భవనాల నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదేశించారు. సమావేశంలో వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కమిషనర్‌ను అవమానపర్చడం సరికాదు**

**కౌన్సిలర్ రాధవేణుగోపాల్**

గతంలో ఎన్నుడూ లేని విధంగా మున్సిపల్ కమి షనర్‌ను అవమానించడం సరికాదని కౌన్సిలర్లు కొత్త పల్లి రాధవేణుగోపాల్ అన్నారు. మున్సిపల్ సర్వ సభ్య సమావేశం జరిగే సమయంలో చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు కమిషనర్ సైతం స్టేజిపైనే కూర్చుం టారని కానీ సిద్దిపేట మున్సిపల్ సర్వసభ్య సమా వేశంలో మహిళ కమిషనర్‌ను స్టేజీపై కాకుండా కింద పక్కన కుర్చీవేసి కూర్చోబెట్టడం సరికాదన్నారు. గతం లో మున్సిపల్ కమిషనర్‌ను స్టేజిపై కూర్చోబెట్టి సమా వేశాలు నిర్వహించారని ఇప్పుడు ఎందుకు కింద కుర్చి వేసి కూర్చోబెట్టారో తెలపాలని ప్రశ్నించారు. మహిళా కమిషనర్ అని అవమానం పర్చడం సరికాదన్నారు.





మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు, వెదిక కింద కూర్చున్న మున్సిపల్ కమిషనర్



## కేంద్ర మంత్రులకు అభినందనల వెల్లువ

**రామచంద్రాపురం, జూన్ 10, ప్రభాతవార్త:** కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన బిజెపి పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్, జి.కిషన్‌రెడ్డిలకు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హైద్రాబాద్ లోని పార్టీ కార్యాలయంలో కేంద్ర మంత్రులు బండి సంజయ్‌కుమార్, కిషన్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలబొకేలు అందించి శుభా కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్, సంగారెడ్డి జిల్లా ఇంచార్జి జైశ్రీ, నాయకులు దేశ్‌పాండే తదితరులు ఉన్నారు.

**బిజెపి మెదక్ జిల్లా నాయకులు...**



సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గడ్డం శ్రీనివాస్ తదితరులు

**మెదక్ మున్సిపాలిటీ, జూన్ 10 ప్రభాతవార్త:** రాష్ట్రం నుంచి రెండో సారి పార్లమెంట్‌లో అడుగుపెడుతున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు కేంద్ర మంత్రి వర్గంలో స్థానం లభించినందుకు బీజేపీ మెదక్ జిల్లా అధ్య క్షులు గడ్డం శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు, ఈటెల రాజేందర్‌ను, కొండ విశ్వేశ్వర్‌రెడ్డి లను సైతం కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

**సిద్దిపేట జిల్లా నేతలు...**



బండి సంజయ్‌ను సనా ్మనిస్తున్న బిజెపి నాయకులు శంకర్ ముదిరాజ్

**సిద్దిపేట రూరల్, జూన్ 10, ప్రభాతవార్త :** కరీంనగర్ ఎంపిగా రెండో సారి గెలుపొంది కేంద్ర మంత్రి వర్గంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్‌ను ఢిల్లీలో సోమవారం కలిసి బిజెపి నాయకులు బైరి శంకర్ ముదిరాజ్ శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అయన వెంట పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## ముంపు గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**గజ్వేల్, జూన్ 10 (ప్రభాతవార్త):** మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, కాళేశ్వరం ప్రాజెక్టులకు సంబంధించిన భూనిర్వాసితులకు పెండింగ్ లో ఉన్న, కేసులలో ఉన్న నిర్వాసితులకు భూమికి భూమి ఇవ్వాలని సోమవారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను గుడాట్‌పల్లి, చిన్నకోడూరు, మామిడ్యాల, బహిలంపూర్, తానేదార్‌పల్లి, గజ్వేల్ పట్టణ శివారులోని ఆర్అండ్ఆర్ కాలనీ గ్రామాలకు చెందిన భూనిర్వాసితులు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊరుకు ఊరు నిర్మించి అవే ఊర్లను గ్రామపంచాయతీ లుగా కొనసాగించాలని కోరారు. పరిహారం ఇవ్వని వారందరికీ వెంటనే ఇవ్వాలని అన్నారు. గజ్వేల్ పట్టణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిహారం ఇచ్చేంత వరకు ఖాళీ చేయించకూడదని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఒంటరి మహిళలకు, 18 సంవత్సరాలు నిండిన మగవారికి కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ప్లాట్లు, ఇండ్లు ఇవ్వాలని అన్నారు. ప్రాజెక్టు కొరకు వాడుకోని భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని కోరారు. త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని మంత్రిని వేడుకున్నారు.

### జెఇఇ పరీక్ష ఫలితాల్లో

## సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థుల ప్రతిభ

**సిద్దిపేట అర్బన్, జూన్ 10, ప్రభాతవార్త :** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటి) విద్యా సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించిన జాతీయ స్థాయి అర్హత పరీక్ష జేఈఈ అడా ్వన్స్‌డ్‌లో మిట్టపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. అదివారం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఐదుగురు విద్యార్థులు దివ్య, అంజలి, స్రవంతి, అంజలి,అస్మిత ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

**గిరిజన గురుకుల విద్యార్థులు...**

**నర్సాపూర్, జూన్ 10, ప్రభాతవార్త :** జెఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ఫలి తాల్లో నర్సాపూర్‌లోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు తమ సత్తాను చాటారని ప్రిన్సిపాల్ బిక్షమయ్య ఒక ప్రకటలో తెలిపారు. గిరి జన గురుకుల పాఠాశాలకు చెందిన విర్యిర్ధి మారుతికుమార్ 92 మార్కులు ఎస్టీ కమ్యూనిటీ ర్యాంక్ 391 సాధించాడని తెలిపారు. కాగా పాఠశాలకు చెందిన మొత్తం 17 మంది విద్యార్థులకుగాను నలుగురు ఐఐటి ర్యాంక్ లు, 5 ప్రెఫొరేటరీ ర్యాంక్‌లు సాధించి సీట్లు పొందనున్నారని తెలిపారు. మిగిలిన విద్యార్థులు 2 ఎన్ఐటిని, 3 ఐఐఐటి సీట్లు పొందె అవకాశ ముందని ప్రిన్సిపాల్ బిక్షయమ్మ తెలిపారు. జెఈఈలో సత్తాచాటినన విద్యార్థులను ప్రాంతీయ సమన్వయ అధికారి (ఆర్‌సి) సంపత్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, సీనియర్ అధ్యాపకులు సిహెచ్ వెంకటయ్య, సుధీంద్ర, శ్రీనివాసలులు, సబ్జెక్ట్ అసోసియేట్స్ కళాశాల, పాఠశాల సిబ్బంది అభినందించారు.

## పేదలకు చేయూత సిఎం సహాయనిధి : బండి రమేష్



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 10, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిరుపేదలకు చేయూత లభిస్తుందని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్‌లోని రైల్వే ట్రాక్ వద్ద గల గుడిసెలలో నివసిస్తున్న సంగేపులా బక్కయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా అతని కుమారుడు శ్రీకాంత్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావుని సంప్రదించారు. దీంతో ఆయన బండి రమేస్ ద్వారా వారిని నిమ్స్ హాస్పిటల్‌కు పంపించి ఎస్టిమేషన్ లెటర్ తెప్పించి ప్రభుత్వానికి అర్జీ పెట్టుకోగా వారికీ ఒకలక్ష డైబై అయిదువేల రూపాయలు మంజూరు అయ్యాయి. అట్టి చెక్కును బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్, గొట్టి ముక్కల వెంకటేశ్వరరావులు సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, శ్రీకాంత్, లలితా తదితరులు పాల్గొన్నారు.

## కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు అభినందనల వెల్లువ..



కిషన్‌రెడికి అభినందనలు తెలుపుతున్న బీజేపీ, జనసేన శ్రేణులు

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 10, ప్రభాతవార్త**

సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి ఎంపీగా గెలిచి కేంద్రంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గంగాపురం కిషన్‌రెడ్డిని, కరీంనగర్ లోక్‌సభ ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్‌లను సోమవారం పలువురు బీజేపీ, జనసేన పార్టీ నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జీ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ఢిల్లీలో కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన కిషన్‌రెడి, బండి సంజయ్‌లను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇరువురికి కేంద్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని వారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రేమ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

### జులై 5, 6 తేదీలలో భవన నిర్మాణ కార్మికుల మహాసభలు

**సైఫాబాద్, జూన్ 10 ప్రభాతవార్త:**

తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) హైదరాబాద్ జిల్లా 3వ మహాసభలు జులై 5, 6 తేదీలలో నిర్వహిస్తున్నామని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం యూనియన్ హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి చెట్టుకింద శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎం.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 1996 భవన నిర్మాణ కార్మికుల చట్టం, 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టాలను అమలు చేయాలని, పెంచిన నిర్మాణ రంగంతో వాడే ముడిసరుకుల ధరలను తగ్గించాలని, అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మోటారు సైకిల్ పథకాన్ని ప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న క్లైముల నిధులు విడుదల చేయాలని, వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి మాట్లాడుతూ కార్మికుల అడ్డాలపై కనీస సౌకర్యాలు కల్పించాలని, కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని, 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా కమిటి సభ్యులు నాగరాజ్, హైమద్, ఎం.నరిసింహ, కాశయ్య, మహమ్మద్ షరీఫ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యాలయంలో వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టిడిపి నేతలు

**ముషీరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:**

హిందూపురం శాసనసభ్యులు నటసింహ నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో భారీ కేక్ కట్ చేసి బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్‌కు ఛైర్మన్‌గా బాలకృష్ణ ఎంతోమంది క్యాన్సర్ బారిన పడిన సామాన్య పేదలకు చికిత్స అందించటం ద్వారా పునర్జన్మనిస్తున్నారని గుర్తుచేశారు. మూడు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్న బాలకృష్ణ అటు తెలుగు చలన చిత్ర పరిశ్రమలో వంద చిత్రాలకు పైగా నటించి, తనదంటూ ప్రత్యేకతను చాటుకున్నారని కొనియాడారు. హిందూపురం నుండి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించిన బాలకృష్ణ నిండు నూరేళ్ళు ప్రజలకు సేవ చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, మేడిపల్లి శ్యాం, ఝాన్సీ, ప్రమీల, యాదగిరిరావు, పుప్పాల బాలకృష్ణ, కప్పకృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కట్ట రాములు, భానుప్రకాష్, కిరణ్, చంద్రమోహన్, రామారావు, వెంకటేష్ చౌదరి, దీపక్, జైస్వాల్, విజయరాజు, యాదగిరి, జోగిందర్‌సింగ్ పాల్గొన్నారు.

## కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు అభినందనలు

**సైఫాబాద్, జూన్ 10 ప్రభాతవార్త:** కేంద్ర మంత్రులుగా జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రమాణ స్వీకారం చేయడం పట్ల లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారికి ఆయన అభినందనలు తెలియజేశారు. కే ంద్ర మంత్రులుగా వారు తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాలని, తెలంగాణ రాష్ట్రానికి విభజన హామీలను రాబట్టడంలో తమ వంతు కృషి చేయాలని ఆయన కోరారు

### వినియోగదారులకు మరిన్ని సౌకర్యాలను అందిస్తుంది

శామీర్‌పేట జూన్10,ప్రభాతవార్త : ఫ్లాట్ ఫాంలో సుమారు 10లక్షలు మరియు 19 కోట్లకు పైగా జిఎస్టీ గల ఉత్పత్తులతో అమేజాన్ నగరంలో బిజినెస్ కస్టమర్స్ కోసం ఏకైక గమ్యాస్థానంగా కొనసాగుతోంది. తమ వినూత్నమైన పరిష్కారాలతో ఎంటర్ ప్రైజ్ సేకరణ చిత్రాన్ని మార్చడాన్ని కొనసాగిస్తోంది. మరియు కస్టమర్స్‌కు సాటిలేని సౌకర్యాన్ని అందిస్తోంది.

# పాఠశాల ప్రారంభమైంది...పరేషాన్ మొదలైంది

## -బేగంపేట ప్రధాన రోడ్డుపై నిల్చిపోయిన ట్రాఫిక్



బేగంపేట ప్రధాన రోడ్డుపైన నిల్చిపోయిన ట్రాఫిక్.

**బేగంపేట జూన్ 10,ప్రభాతవార్త**

బేగంపేటలో ఓ ప్రయివేటు పాఠశాల నిర్వాకం వాహన దారులకు పరేషాన్ చేస్తుంది. ఆ పాఠశాల ప్రారంభమైందంటే చాలు ప్రధాన రోడ్డు జాం జాం గా మారి పోతుంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బేగంపేట ప్రధాన రోడ్డుపై ఉండే ఓ పాఠశాల కు వచ్చే వాహనాలతో ఫతేనగర్ లింక్ రోడ్డు, పంజాగుట్టల నుంచి వచ్చే వాహన దారులకు నరకాన్ని చవిచూయిస్తుంది. ఈ పాఠశాలకు గతంలో ఉన్న ఎంట్రీ గేటు మయూరిమార్గ్ జంక్షన్ ఎదుట ఉండేది. అయితే కొద్ది నెలల క్రితం ఫతేనగర్ లింక్ రోడ్డు సమీపంలో ఉన్న ఆ పాఠశాల గేటు ను ఇన్ గేట్ గా మార్చి మయూరి జంక్షన్ ఎదురు అవుట్ గేట్ గా మార్చారు. దీంతో ఆ పాఠశాలకు వచ్చే వాహనాలతో ఉదయం, సాయంత్రం సమయాలలో ఈ ప్రాంతంలో వాహనాలు రోడ్డుపైన భారీ ఎత్తున నిల్చిపోవడంతో బేగంపేట ఫ్లై ఓవర్, ఫతేనగర్ లింక్ రోడ్లపై భారీ ఎత్తున ట్రాఫిక్ నిల్చిపోతుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ పాఠశాలకు లోపల పార్కింగ్ ఉన్నా రోడ్డుపైన వాహనాలను నిలిపి వేయడంపై వాహనదారులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సోమవారం ఆ పాఠశాల ప్రారంభం కావడంతో ఈ ప్రాంతంలో మరోసారి ట్రాఫిక్ జాం అయింది. ఈ జాంలో ఇరుక్కు పోయిన అంబులెన్స్ ఆ ట్రాఫిక్ ను దాటి వెళ్లేందుకు 10 నిమిషాల సమయం పట్టింది. ఒక వైపు పంజాగుట్ట నుంచి వచ్చే బేగంపేట ఫ్లై ఓవర్ నుంచి వచ్చే వాహనాలు ఇక్కడికి కొద్ది దూరంలోనే దిగుతాయి. ఇదే సమయంలో ఫతేనగర్ లింక్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు కూడా ఇక్కడ కిందికి దిగుతాయి. ఈ ప్రాంతంలో వాహనాలు వేగంగా ఉంటాయి. ఒక్కసారిగా ఈ పాఠశాల ముందు ట్రాఫిక్ జాం ఉండటంతో సడెన్‌గా బ్రేకులు వేస్తే ఒక వాహనాన్ని మరో వాహనం ఢీ కొని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అసలే ఈ ప్రాంతం రెండు ఫ్లై ఓవర్లు కిందికి దిగే ప్రాంతం. గతంలో ఎన్నో ప్రమాదాలు సైతం ఇక్కడ చోటు చేసుకున్నాయి. ఇలాంటి ప్రాంతంలో పాఠశాలకు ఎంట్రీ గేటు ఇవ్వడం ఎంత వరకు కరెక్ట్ అంటూ వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలలో విశాలమైన పార్కింగ్ ఉన్నా వారి వాహనాలను లోపల పార్కింగ్‌లో ఉంచుకోకుండా ఇలా ప్రధాన రోడ్డు పైనే వాహనాలను నిలిపి వేసి ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించడం ఎంతవరకు సమంజసం అంటూ ప్రజలు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇక పాదచారులు కూడా నడిచేందుకు వీలు కూడా ఉండటం లేదని సమీప బస్తీలైన ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ, వడ్డెరబస్తీ, బ్రాహ్మణవాడీ, మాతాజీనగర్, శ్యాంలాల్ బిల్డింగ్ బస్తీల వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ ప్రాంతంలో ట్రాఫిక్ జాం కాకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## పి.వి.నరసింహారావు సాహిత్య ప్రత్యేక పునాస సంచికావిష్కరణ



పునాస ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న బుర్రా వెంకటేశం, బాలాచారి, సుదర్శన్‌లు

**రవీంద్రభారతి, జూన్ 10 ప్రభాతవార్త :**

భారతదేశ పూర్వ ప్రధానమంత్రి, ప్రముఖ సాహితీవేత్త పి.వి.నరసింహారావుకు భారతరత్న పురస్కారం ఇచ్చిన సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ పి.వి.నరసింహారావు సాహిత్యంపై ప్రత్యేకంగా వెలువరించిన పునాస ఏప్రిల్-జూన్ 2024 సాహిత్య సంచికను తెలంగాణ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం మధ్యాహ్నం ఆవిష్కరించారు. ఈ మేరకు రవీంద్రభారతి ప్రాంగణంలోని కళాభవన్‌లోని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి, పునాస సంపాదకుడు డా. రాపోలు సుదర్శన్ తదిర సాహిత్యవేత్తలతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు.

## వాహనాలు జాగ్రత్తగా నడపాలి

### -బేగంపేట టిటిఐ ఏసిపి శంకరరాజు



ఏపీస్టేట్ ఫైనాన్షియల్ కార్పోరేషన్ కార్యాలయంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఏసీపీ.

**బేగంపేట జూన్ 10,ప్రభాతవార్త**

వానాకాలం ప్రయాణాలలో ప్రమాదాలు పొంచి ఉంటాయని, చిన్న పాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి కారణంగా మారుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని బేగంపేట టీటీఐ ఏ సీ పీ జి.శంకరరాజు అన్నారు. సోమవారం బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ కార్పోరేషన్ సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకరరాజు మాట్లాడుతూ వర్షాకాలంలో వాహనాలు చాలా జాగ్రత్తగా నడపాలన్నారు. వర్షానికి రోడ్లపై టైర్లు జారిపోయే అవకాశం ఉందన్నారు. అలాగే రోడ్లపై గుంతలు ఉండే ప్రమాదం ఉందని, ముందు వెళుతున్న వాహనాన్ని కూడా గమనిస్తూ నిదానంగా ప్రయాణించాలన్నారు. అతి వేగం ఎప్పుడూ మంచిది కాదన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో కార్లకు ఉండే వైఫర్లు పనిచేసేలా చూసుకోవాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రయివేటు బస్సులు రాంగ్‌రూట్లో ప్రయాణిస్తూ ఇతర వాహనదారులకు ఇబ్బందులు కల్గిస్తున్నారని, ఇదే సమయంలో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇలాంటి వాహనాల వల్ల ఆయా జంక్షన్లలో ట్రాఫిక్ జాం అయ్యే అవకాశాలు కూడా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వారు వెలిబుచ్చిన సందేహాలకు ఏ సీ పీ సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 150మంది ఫైనాన్షియల్ కార్పోరేషన్ సిబ్బంది ఏపీఎస్‌ఎఫ్‌సీ తెలంగాణా డివిజన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ ఎమ్.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ పద్మాకర్ రావు, ట్రాఫిక్ ఎస్సై పాండు రంగరాజు, పీసీ అయాన్, హెచ్ జి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కిషన్ రెడ్డిని కలిసిన బిజెపి నాయకులు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన జూబ్లిహిల్స్ నియోజకవర్గం బిజెపి నాయకులు.

**యూసుఫ్‌గూడ, జూన్ 10, ప్రభాతవార్త**

దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి తమకు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించారని వారం దరికి ఎప్పటికి రుణపడి ఉంటానని కేంద్ర మంతి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం జూబ్లిహిల్స్ నియోజకవర్గం బీజేపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే లంకల దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్ళి కిషన్‌రెడ్డిని కలిశారు. ఆయనకు రెండోసారి కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఆయనను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంటరీ పరిధిలోని జూబ్లిహిల్స్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు తమ వంతు కృషి చేస్తానని అన్నారు. తన గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరిని తాను స్వయంగా కలుస్తానని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా బీజేపి అధ్యక్షులు గౌతమ్‌రావు, జూబ్లిహిల్స్ నియోజకవర్గంఅసెంబ్లీ కన్వీనర్ కుంభాల గంగరాజు, అట్లూరి రామకృష్ణ, ప్రేమ్‌కుమార్, పాల్గొన్నారు.

### కంటోన్మెంట్‌లో పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి : శ్రీగణేష్



కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను అభినందిస్తున్న బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ తదితరులు

**కంటోన్మెంట్, జూన్ 10 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు సూచించారు. సోమవారం సిఈఓను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రసూల్‌పురా, బోయిన్‌పల్లి రమన్నకుంట చెరువు, వెస్ట్ మారేడ్‌పల్లి నాలాల సమస్యలను పరిష్కరించి నాలా పూడికతీక పనులను పూర్తి చేయాలని సిఈఓ దృష్షికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంకి రవిందర్, దేవుడు, తేజ్‌పాల్, సదానంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### జిహెచ్‌ఎంసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : శంకరన్న



జోనల్ కమీషనర్‌తో బేటీ అయిన బిఎం.ఈయు.శంకర్ ప్రకాశ్ తదితరులు

**అడ్డగుట్ట, జూన్ 10 ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసిలో పనిచేస్తున్న 4వ తరగతి ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బిఎం.ఈయు. గుర్తుంపు పొందన యూనియన్ అధ్యక్షులు శంకరన్న, ప్రధాన కార్యదర్శి అస్రప్ అలీ, జోనల్ అధ్యక్షులు ప్రకాశ్‌లు సోమవారం సికింద్రాబాద్ జోనల్ కమీషనర్‌జ రవి కిరణ్‌తో సమావేశమై ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వాటిని వెంటనే పరిష్కరించాలని ఆయన దృష్టికి తెచ్చారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు వారికి రావాల్సిన బకాయిలను వెంచనే చెల్లించాలని, ఇంక్రుమెట్‌లు సకాలంలో చెల్లించాలని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు నరి స్ంగ్ రావ్, జహింగీర్ తదితరులు పాల్గొన్నారు.

### బిసి సంక్షేమ సంఘాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అండగా నిలవాలి

**యూసుఫ్‌గూడ, జూన్ 10, ప్రభాతవార్త**

బస్తీల సంక్షేమ సంఘాలు అభివృద్దికి, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వారధిగా నిలవాలని హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షులు, జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు. సోమవారం ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని హైమావతి నగర్ బస్తీలో జరిగిన సంక్షేమ సంఘం ఎన్నికల్లో కె.బాలు 54ఓట్ల మెజారిటీతో తన ప్రత్యర్ధి అయిన సురేష్ గౌడ్‌పై విజయం సాధించారు. ఈసందర్భంగా శాసన సభ్యులు మాగంటిగోపినాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అందుకు ఆయన వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు డి.సంజీవ, యాదగిరి, నర్స్ంగరావు, దస్తగిరి, చంద్రశేఖర్, నర్స్ంహ, తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లిలో బిజెపి శ్రేణులు సంబురాలు



నాంపల్లి బిజెపి కార్యాలయంలో సంబురాలలో పాల్గొన్న బిజెపి నాయకులు,అభిమానులు

**అఫ్జల్‌గంజ్, జూన్ 10 ప్రభాతవార్త:** దేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోడి మూడవ సారి ప్రమాణస్వీకారణం చేసిన సందర్భంగా నాంపల్లిలోని తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయం వద్ద బిజెపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు సంబురాలు చేసుకున్నారు, మాజీశాసనసభ్యులు ప్రేమ్‌సింగ్ రాథోడ్, రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జ్ డి.గోపాల్‌జీలు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి ప్రధానమంత్రిగా నరేంద్రమోడి ప్రమాణస్వీకారం చేయడం పట్ల భారతీయులకు గొప్ప వరమన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### తాగిన మైకంలో పోలీస్ వాహనంపైకి రాయి లేపిన యువకుడు

**చార్మినార్, జూన్ 10 ప్రభాతవార్త :** తాగిన మైకంలో ఓ యువకుడు పోలీసులపై దాడికి ప్రయత్నించిన సంఘటన మొగల్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..హుస్సే నీఆలంకు చెందిన ముష్ఫె ఐదు సంవత్సరాల వయస్సు గల ఓ యువకుడు ఆదివారం రాత్రి తాగి చార్మినార్ బస్టాండ్ రహదారిలో ఉన్నాడు. అదే సమయంలో చార్మినార్ బస్టాండ్ రహదారిపై పెట్రోలింగ్ చేస్తున్న మొగల్‌పుర పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ వాహనం వద్దకు ఆ యువకుడు వచ్చాడు. వాహనంలో ఉన్న పోలీసుల పైకి రాయి లేపి కొట్టేందుకు యువకుడు ప్రయత్నించాడు. ఆ సమయంలో యువకుడు తాగిన మైకంలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ కేసును మొగల్‌పుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రౌడీ షీటర్లకు యావజ్జీవ కారాగార శిక్ష

**చార్మినార్, జూన్ 10 ప్రభాతవార్త :** ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో పాతబస్తీకి చెందిన ముగ్గురు రౌడీషీటర్లకు నాంపల్లి మెట్రో పాలిటన్ కోర్టు యావ జీవ కారాగార శిక్షతో పాటు 25 వేల రూపాయలు జరిమానా విధించిందని బహదూర్‌పుర పోలీసులు వెల్లడించారు. బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రఘునాద్ కథనం ప్రకారం..రంనాస్‌పుర ప్రాంతానికి చెందిన మన్సూర్‌ను జూపార్కు ఎదురుగా ఉన్న ప్రాంతంలో 2017వ సంవత్సరం జనవరి నెల 28వ తేదీన రంనాస్‌పుర ప్రాంతానికి చెందిన రౌడీ షీటర్లు అయిన షేక్ ఖాలీద్ (40), మహ్మద్ అన్వర్ అలియాస్ అన్ను (35), మహ్మద్ మనావర్ అలీ అలియాస్ బబ్బు (30)లు కలిసి హత్య చేశారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ హరీష్ కౌశిక్ పర్యవేక్షణలో పోలీసులు కేసుకు సంబంధించిన సాక్ష్యాలను నాంపల్లి మెట్రో పాలిటన్ కోర్టులో ప్రవేశ పెట్టారు. కాగా నాంపల్లి మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి బి.సురేష్ మంగళవారం మన్సూర్‌ను హత్య చేసిన కేసులో ముగ్గురు రౌడీ షీటర్లకు యావజీవ కారాగార శిక్ష విధించారని బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రఘునాద్ తెలిపారు.

### ప్రగతి నగర్ చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 10, ప్రభాతవార్త :**

గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్ చెరువులో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ మేరకు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహన్ని వెలికి తీసి చూడగా అతనికి సంబంధించిన ఆనవాలు ఏమీ లేకపోవడంతో ఆ వ్యక్తి ఎవరనేది తెలియకుండా ఉందన్నారు. గుర్తు తెలియని మృతుడి వయసు 25 నుండి 30 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులను వెంటనే ట్రైనింగ్‌కు పంపాలి

### -బిసి యువజన నిరుద్యోగ సంఘ అధ్యక్షుడు నీలం వెంకటేష్



డిజిపి కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న నీలం వెంకటేష్, పోలీసు అభ్యర్థులు

**నాంపల్లి, జూన్ 9 ప్రభాతవార్త :** 2022పిసి పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులను వెంటనే ట్రైనింగ్‌కు పంపాలని బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నిరుద్యోగ సంఘం అధ్యక్షుడు నీలం వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ అభ్యర్థులను వెంటపెట్టుకొని స్థానిక డిజిపి కార్యాలయంలో ట్రైనింగ్ ఐజి అభిలాషబిస్తను కలిసి వినతిపత్రం సమర్పించారు. చాలామంది అభ్యర్థులు ఇళ్లు విడిచి బైట తలదాచుకొంటూ మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఐజి స్పందిస్తూ ఏఆర్31 సివిల్34 మొత్తం 65మందిని ట్రైనింగ్ పంపుటకు స్థలంలేక ఆర్పిఎస్ గ్రౌండ్ అద్దెకు తీసుకోవడానికి మాట్లాడినట్లు, అయితే అభ్యర్థులను ట్రైనింగ్‌కు పంపడానికి 60 నుండి 80 లక్షల బడ్జెట్ విడుదల చేస్తే 15రోజుల్లో ట్రైనింగ్‌కు పంపడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే తగిన బడ్జెట్‌ను విడుదలచేసి అభ్యర్థులను వెంటనే ట్రైనింగ్‌కు పంపి 65 మంది కుటుంబాలలో సంతోషాన్ని నింపాలని నీలం వెంకటేష్ ముఖ్యమంత్రి ఎను మున రేవంత్‌రెడ్డిని కోరారు. అంతేకాకుండా కొంతమంది అభ్యర్థుల బోనఫైడ్, ఎస్బీ ఇష్యూ ఉన్న వారి కేసులు కూడా వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తిచేశారు.

## ట్యాంక్ బండ్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

### -కూడలిలో లేని పోలీసులు

### -ఆగ్రహం వ్యక్తం చేసిన వాహనదారులు

**హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:** ట్యాంక్ బండ్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రాణీ గంజ్ వైపు గానీ, లిబర్టీ వైపు గానీ సుమారు గంట సేపటి నుంచి ఒక్క వాహనం కూడా కదిలే పరిస్థితి లేకుండా పోయింది. ఆ సమయంలో రోడ్డు కూడలిలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులు తెలుగు తల్లి ఫ్లైఓవర్ కింద మూడు ప్రక్కల నుంచీ ముందుకు రావడంతో ట్రాఫిక్ జామ్ సంభవించి గ్రిడ్‌లాక్ అయ్యింది. దాంతో ఎటూ పోలేని పరిస్థితిలో ట్రాఫిక్‌లో ఉన్న సామాన్యులు ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్యాంక్ బండ్‌కు వచ్చే అన్ని దారులూ ట్రాఫిక్ జామ్‌తో గంట పాటు స్థంబించిపోవడంతో మండిపడుతున్నారు.

### బిజెపి హయాంలోనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి



కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్ కుమార్‌ను కలిసిన పాతబస్తీ బిజెపి నాయకులు

**చార్మినార్, జూన్ 10 ప్రభాతవార్త :** కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బిజెపి ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్‌ను రాష్ట్ర యువ మోర్చ అధికార ప్రతినిధి ఏ.శివచంద్ర గిరి, బిజెపి భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు పొన్న వెంకట రమణతో పాటు పాతబస్తీకి చెందిన పలువురు బిజెపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువమోర్చ అధికార ప్రతినిధి శివ చంద్రగిరి మాట్లాడుతూ బిజెపి హయాంలోనే దేశం అన్ని రంగాలలోను ఎంతగానో అభివృద్ధి సాధించిందని తెలిపారు. పాతబస్తీకి చెందిన పలువురు బిజెపి నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు కార్పొరేట్ వైద్య చికిత్సలు అందించాలి : స్పీకర్ ప్రసాద్‌కుమార్



కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 10 ప్రభాతవార్త:**

దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు కార్పొరేట్ వైద్య చికిత్సలు అందించాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కోరారు. ఇండో జపనీస్ సీటీఓ క్లబ్ 10వ సమ్మిట్ వ్యవస్థాపకులు, కేర్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ అధిపతి (హెచ్‌డ్) డాక్టర్ సూర్యప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు స్పీకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. సాంప్రదాయ శస్త్ర చికిత్సలకు సురక్షితమైన, ప్రభావంతమైన ప్రత్యామ్నాయాన్ని ఈ చికిత్సల ద్వారా అందించవచ్చన్నారు. ఇటువంటి చికిత్సలు నగరంలోని పలు ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నాయని, దేశంలోనే ప్రాచుర్యం పొందిన ఆసుపత్రులు నగరంలో ఉన్నాయన్నారు. వైద్యులతో పాటు రాష్ట్రంలో పలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందుబాటుఉలో ఉన్నాయని వివరించారు. వీటిని గ్రామీణ ప్రాంత అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండాలని నిర్వాహకులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు మరిన్ని నిర్వహించి యువ వైద్యులకు ప్రత్యేక అంవాల్లో సంపూర్ణ అవగాహన కల్పించాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాల అండదండలు అందిస్తుందని అన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

### -ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

### -డిసి రవి కుమార్



**అత్తాపూర్ జూన్10,ప్రభాతవార్త :**

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్‌ఎంసి డిప్యూటి కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని జిహెచ్‌ఎంసి కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి కమిషనర్ ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిసి రవి కుమార్ మాట్లాడుతూ...ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజేంద్రనగర్ పరిధిలో ఎక్కడైన సమస్యలు ఉంటే తక్షణమే తమ దృష్టికితీసుకురావాలన్నారు. ప్రజావాణిలో ప్రజ సమస్యల పరిష్కరమే లక్ష్యంగా పని చేయడం జరుగుతందని అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెండు ఫిర్యాదులను అందుకోవడం జరిగిందని వాటి పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి అధికారులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిఆర్ఎస్ కౌన్సిలర్లు

## మహిళ కమిషనర్‌ను అగౌరవపర్చలేదు

**బిఆర్ఎస్ కౌన్సిలర్లు**

**సిద్దిపేట రూరల్, జూన్ 10, ప్రభాతవార్త:** మున్సిపల్ మహిళ కమిషనర్‌ను అగౌరవపర్చాలన్న ఉద్దేశ్యం తమకు ఏమాత్రం లేదని..కొంత మంది పనిగట్టుకొని మహిళ కమిషనర్‌ను అవమాన పర్చారని తప్పుడు అరోపణలు చేయడం సరికాదని బిఆర్ఎస్ కౌన్సిలర్లు ధర్మవరం బ్రహ్మం, కలకుంట్ల మల్లికార్జున్, గాదగోని వినోద్‌గౌడ్, గుండ్ల యోగి, నాయకం లక్ష్మణ్‌లు అన్నారు. సిద్దిపేటలో వారు సోమవారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఎప్పుడు మహిళలను గానీ మహిళ అధికారులనుగానీ అగౌరవపర్చ లేదన్నారు. మహిళలను గౌరవించడమే తమ మొదటి కర్తవ్యమన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. ఏదైనా పని మీద వెళ్లితే పట్టించుకోకుండా కౌని ్సల్లర్ల మన్న కనీస గౌరవం లేకుండా మాట్లాడుతున్నారని వాపోయారు. పట్టణంలో ఎన్ని భవనాలకు అనుమతులు ఇచ్చారని ప్రశ్నిస్తే సమాధానం చెప్పడం లేదని కోర్టులో వాదనాలు నడుస్తున్న వాటికి అనుమతులు ఇచ్చారని ఏలా ఇచ్చారని ప్రశ్నిస్తే సమాధానం చెప్పడం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ కనీస గౌరవం లేకుండా అవమాన పర్చేలా మాట్లాడుతున్నారని సభ్యులు అవేదన వ్యక్తం చేశారు. మహిళ కమిషనర్‌ను అవమాన పర్చారని కొంత మంది చేస్తున్న తప్పుడు అరోపణలు ఖండిస్తూ తాము మహిళ కమిషనర్‌ను అవమాన పర్చలేదన్నారు. మహిళలు అంటే తమకు గౌరవం ఉంటుందన్నారు. సమావేశంలో కో-అప్షన్ సభ్యులు సయ్యద్, బిఆర్ఎస్ నాయకులు వంగ తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

**కోహెడ, జూన్ 10, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వింజపల్లి గ్రామంలో ఎంపి బండి సంజయ్ నిధుల నుంచి ఏర్పాటు చేసిన హై మాస్ లైట్లను సోమవారం ప్రారంభించారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు బండి సంజయ్ ఎంపి నిధులతో మంజూరైన హై మాస్ లైట్లు ఎన్నికల కోడ్ ఉండడంతో ప్రారంభించ లేదని పార్టీ నాయకులు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి సుధీర్‌గౌడ్, బిజెపి మండలశాఖ అధ్యక్షులు ఖమ్మం తిరుపతి తదితరులు హై మాస్ లైట్లను ప్రారంభించారు. మండలంలోని వింజపల్లి, కోహెడ, ధర్మసాగర్‌పల్లి, మోతిరాంతండా, బస్వాపూర్, కాచాపూర్, కూరెళ్ల, రాంచంద్రపూర్, వరు కోలు, తంగళ్లపల్లి, శనిగరం, తీగలకుంటపల్లి గ్రామాలకు హై మాస్ లైట్లు మంజూరు కాగా ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రారంభించినట్లు బిజెపి శ్రేణులు తెలిపారు.కార్యక్రమంలో బిజెపిశ్రేణులు తిరుపతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, సదానందం, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి,వేణు, శ్రీనివాస్, దామోదర్‌గౌడ్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 16న శ్రీరామ శిల శోభాయాత్ర



శ్రీరామ శిల శోభాయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సంగారెడ్డి టౌన్, జూన్ 10, ప్రభాతవార్త:** ఈ నెల16న మండలంలోని ఫసల్‌వాదిలోని విద్యాపీఠంలో శ్రీరామశిల శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్దాంతి తెలిపారు. సోమవారం విద్యాపీఠంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ మాట్లాడుతూ 16న మధ్యాహ్నం 1 గంటలకు పోతిరెడ్డిపల్లి సంగమేశ్వర దేవాలయం వద్ద శిలాయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. యాత్రలో 10వేల మంది భక్తులు పాల్గొంటా రన్నారు. 13 కోట్ల రామనాభ జపం యత్రలో కార్యక్రమం జరుగుతుం దన్నారు. 1వేయి మంది మహిళలు కళశాలను ధరిస్తారన్నారు. రాత్రి 8 గంటలకు పర్సనల్ వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంకు యాత్ర చేరుకుంటుందని వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. సమావేశంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంతకృష్ణ, ప్రశాంత్‌కుమార్, సింథిత్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకుల పాదయాత్ర



పాయాత్రకు స్వాగతం పలికిన నర్సాపూర్ బిజెపి నాయకులు

**నర్సాపూర్, జూన్ 10, ప్రభాతవార్త :** మెదక్ ఎంపిగా బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావు విజయం సాధించినందులకుగాను గుమ్మడిదలకు చెందిన ఆ పార్టీ నాయకులు ఉదయ్ ఆధ్వర్యంలో పలువురు గుమ్మడిదల నుండి ఏడుపాయల వనదుర్గ మాత ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. సోమవారం నర్సాపూర్‌కు చేరుకున్న ఈపాదయాత్రకు బిజెపి నాయకులు ఘన స్వాగతం పలికారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావు విజయం సాధించినట్లైతే గుమ్మడిదల నుండి ఏడుపాయాలకు పాదయాత్రగా వస్తామని బిజెపి నాయకులు మొక్కుకున్నారు. ఈమేరకు రఘునందన్‌రావు విజయం సాదించినందున ఈ మొక్కును తీర్చుకోవడానికి పాదయాత్ర చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈమేరకు నర్సాపూర్ బిజెపి నాయకులు తమ సంఘీభావం తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రదాన కార్యదర్శి, కౌన్సిలర్ గోద రాజెందర్, కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ హన్మంతు రమణారావు, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, దేవేందర్‌యాదవ్, వంశీగౌడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పేద ఇంటి నిర్మాణానికి సిమెంట్ అందజేత

**తలకొండపల్లి, జూన్ 10,ప్రభాతవార్త :**

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మం డలం మరియు గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పూర్తి ఇండ్ల నిర్మాణం అసంపూర్తిగా ఇడ్ల నిర్మాణంలో భాగంగా సోమవారం నిరుపే కుటుంబానికి చెందిన అచ్చగారి జంగయ్య ఇంటి ఫినిషింగ్ కోసం ఉప్పల చారిటబుల్ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ స్థానిక జడ్పిటిసి వెంకటేష్ తన ట్రస్ట్ ద్వారా సిమెంట్ ఇప్పించి జరిగింది. అచ్చియారి జంగయ్య కుటుంబ సభ్యులు వెంకటేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో జడ్పిటీసీ ఉప్పల వెంకటేష్ గ్రామ సర్పంచ్ లలిత జోతయ్య సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్ నరసింహ మల్లేష్ శ్రీశైలం గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# పల్లె నిద్రలో అధికారులు విధిగా హాజరుకావాలి

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**

**నర్సాపూర్, జూన్ 10, ప్రభాతవార్త :** బడిబాట కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 'పల్లె నిద్ర'లో అధికారులు విధిగా హాజరుకావాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం నర్సాపూర్ మండలం జక్కపల్లి గ్రామంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆధ్వర్యంలో తలపెట్టిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని ఇందుకు ప్రభుత్వ అధికారులు సైతం తప్పక హాజరుకావాలని ఆదేశాలివ్వడం జరిగింది. ఈ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ జక్కపల్లి గ్రామంలో పల్లెనిద్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తానూ పాల్గొననున్నారన్నారు. గ్రామాల్లో బడి ఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని బడిలోనే ఉండాలన్నారు. ఈ మేరకు ఒక్కో అధికారి 100 ఇండ్లల్లో సర్వే చేయాలన్నారు. జిల్లాలోని అన్నిగ్రామ, మండల, నియోజకవర్గాల్లో ప్రత్యేక అధికారులు పల్లె నిద్ర చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. ప్రజల్లో విద్యకోసం చైతన్యం చేసి బడీడు పిల్లల నందరిని బడిలో చేర్పించాలని,ఒక్క విధ్యార్థి కూడ బయట ఉండకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామంలో ఉన్న గడపగడపకు తిరిగి విద్యా గొప్పతనాన్ని భోదిస్తునే విధ్యార్థులను పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ మండల అధికారులు ఖచ్చితంగా 100 ఇండ్లను సర్వే చేసి బడీడు పిల్లలను బడికి పంపించేవిదంగా తల్లిదండ్రులను ఒప్పించాలని అన్నారు. ఈమేరకు నర్సాపూర్ మండలంలోని జక్కపల్లి గ్రామంలో సోమవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ఉదయం మంగళవారం గ్రామంలో ఇంటింటికి తిరిగి విధ్యార్థులకు , తల్లిదండ్రులకు చదువు పై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు.

## మైనార్టీ బాలుర గురుకుల కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** మైనార్టీ బాలుర గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తు న్నట్లు ప్రిన్సిపల్ పకీలా రాత్లావత్ ఒ ప్రకటనలో తెలిపారు.2024- 25 విద్యా సంవత్సరం గాను ఎంపిసి గ్రూప్‌లో 4,బైపిసి గ్రూపులో 4 సీట్లు మొదటి సంవత్సరంలో ఖాళీలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందవాల్సిన విద్యార్థులు జూన్ 15వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన అన్నారు.మిగతా వివరాలకు 9959746436, 7331170809 ఫోన్ నంబర్ల ద్వారా సమాచార నిమిత్తం సంప్రదించవలిసిందిగా ఆయన తెలిపారు

## తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలి

**సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహారెడ్డి**

**కడ్తాల్, జూన్ 10 ప్రభాతవార్త :** అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యం లో జరుగుతున్న ఆటా 2024 కన్వెన్షన్‌లో ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసిన తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం కార్యక్రమంలో సర్పం చ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మినరసింహారెడ్డి పాల్గొన్నా రు. టిడిఎఫ్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రవాస భారతీయులు తెలంగాణలో విద్య, వైద్యం, నీటిపారుదల మొ దలగు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రస్తు తం ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న విద్యా పథకాలు సత్ఫలితాలు సాధించే దిశగా ప్రభుత్వ, ప్రవాస భారతీయుల భాగస్వామ్యంపై చర్చిం చినట్లు తెలిపారు. సమావేశంలో ఎల్ఎన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు విద్యాభ్యాసం, క్రీడల్లో సాధించిన విజయా లను అందరికి తెలిసే విధంగా ప్రతి గ్రామంలో కరపత్రాల ద్వారా లేదా అందుబాటులో ఉన్న వ్యవస్థ ద్వారా ప్రచారం నిర్వహించాలని, ఎక్కువ మొత్తంలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే విధంగా పాఠశాల అధ్యాపకులతో కలిసి ప్రణాళికను రచించాలని కోరారు. సొంత గ్రామాలలో పాఠశాలల అభివృద్ధికి ఎన్ఆర్ఐలు సహ కరించాలని, ప్రతి ఎన్నారై సొంత ప్రాంతాలలో ఉన్న పాఠశాలను దత్తత తీసుకుని పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. టిడిఎఫ్ ఫౌండర్ మధు, కె.రెడ్డి, కిశోర్ గూడూరు, భర త్‌రెడ్డి, ప్రీతి, నర్సింహరెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## చదువు మనిషిని సంపూర్ణ మానవుడిగా మారుస్తుంది

**కోట్‌పల్లి, జూన్ 10,ప్రభాతవార్త;** మనిషి సంపూర్ణ మానవుడిగా ఎద గాలంటే కేవలం చదువుతోనే సాధ్యమవుతుందని ఇది కేవలం ప్రభు త్వ పాఠశాలలతోనే సాధ్యమవుతుందని బార్వాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సీఎచ్ వెంకట్‌రత్నం అన్నారు.సోమవారం నాడు నిర్వహిం చిన బడిబాట కార్యక్రమంలో భాగంగా మోమిన్‌పేట్ మండలంలోని హిజ్రాచిట్టంపల్లి గ్రామంలో బడిఈడు గల పిల్లలని ఆరో తరగతి నుండి పదోవ తరగతి వరకు ఇంగ్లీష్ మరియు తెలుగు మీడియంలలో పాఠశా లలో భోధన నిర్వహిస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలని చేర్పించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పిల్లలు ఉండే చోట బడి ఒక్కటే నని పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలని అయన పిలుపునిచ్చారు. అనంతరం హిజ్రా చిట్టంపల్లి గ్రామంలో గడపగడపకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేసి పిల్లలను బడికి పంపేలా వారి వారితో మాట్లాడారు పశువుల కాపరుగా మారుతున్న పిల్లలను బడిలో చేర్పించేలా తల్లిదండ్రులు కృషి చేయాలని అయన పేర్కొన్నారు, ఈకా ర్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, రాంచెంద్రయ్య, ఫరూక్, విజయ, తదితరులు పాల్గోన్నారు,

## ఇద్దరు విద్యార్థులు అదృశ్యం

**మేడ్చల్, జూన్ 10, ప్రభాతవార్త :** అనాధ ఆశ్రమంలో ఉండే ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వనపర్తికి చెందిన గణేష్ (15), నగరంలోని ఏఎస్ రావు నగ ర్‌కు చెందిన సన్నీ సామ్యూల్ (11) మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి గ్రామంలో గల కృషి హోం అనాధ ఆశ్రమంలో ఉంటూ చదువుకుంటున్నారు. కాగా వీరు సోమవారం ఉదయం 8 గంటలకు ఆశ్రమం నుంచి వెళ్లి తిరిగి రాలేదు. వీరి కోసం పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో ఆశ్రమ కేర్ టేకర్ భాస్కర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

**కుల్కచర్ల ఎంపిడివో రామకృష్ణ నాయక్**

**కుల్కచర్ల, జూన్10,ప్రభాతవార్త :** అమ్మ ఆదర్శపాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పాఠశాలల పునర్ ప్రారంభం సమయానికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కుల్కచర్ల ఎంపిడివో రామకృష్ణ నాయక్ అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం కుల్కచర్ల మం డల పరిధిలోని అంతారం బిందెంగడ్డ తండా తొంరెడ్డిపల్లి గ్రామ పంచాయ తీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో చేపడుతున్న పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థులందరికీ ఉచితంగా పాఠశాల యూనిఫామ్‌లను అందిం చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీ వీధుల్లో తిరుగుతూ మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## ఐఐటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన షాద్‌నగర్ విద్యార్థి

**షాద్‌నగర్, జూన్ 10, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ పట్టణానికి చెందిన భగవాన్‌దాస్ ఐఐటీలో ఉత్తమ ప్రదర్శన కనబరిచ్చారు. పట్టణంలోని శ్రీ నారాయణ విద్యాసంస్థలో చదువుతున్న భగవాన్‌దాస్ ఐఐటీ మెయి న్స్ క్యాటగిరీలో 95, అడ్వాన్స్‌లో 1000వ ర్యాంక్ సాధించి తన ప్రతిభా చాటుకున్నారు. దీంతో సోమవారం శ్రీ నారాయణ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.డి.వజీద్‌పాష విద్యార్థిని శాలువతో ఘనంగా సత్కరించి పూలమాలలు వేసి పాఠశాల తరుపున అభినం దించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఐఐటీలో ఉత్తమ ప్రదర్శన కనబరిచ్చి మంచి ర్యాంకు సాధించిన భగవాన్ దాస్ ఇటు పాఠశాలకు, అటూ షాద్‌నగర్ ప్రాంతానికి మంచి పేరు తీసుకువ చ్చారని కొనియాడారు. ఇదేవిధంగా మరింత రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఈ.ఉమాదేవి, విద్యార్థి తండ్రి శంకర్, అన్న శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలి

**ఎంఐఎం పార్టీ తాలుక అధ్యక్షులు ఎస్టీ గుల్షన్**

**కొడంగల్,జూన్10,ప్రభాతవార్త :** కొడంగల్ మండల వ్యాప్తంగా బెల్టుషాపు లలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని వాటిని వెంటనే అరికట్టాలని కొడంగల్ నియోజకవర్గ ఎంఐఎం పార్టీ అధ్యక్షులు గుల్షన్ ఎక్సైజ్ సిఐ వెంకటేశంకి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రాత్రి,పగలు అనే తేడాలేకుండా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని దీంతో యువత మద్యంకు బానిసై వారి భవిష్యత్తున్ నాశనం చేసుకుంటున్నారని అన్నారు.కొడంగల్ పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా గ్రామాల్లో కిరాణ దుకాణాలు, హోటళ్లు,దాబలలో యతె చ్ఛగా ఈ మద్యం విక్రయిస్తుండటంతో గ్రామాల్లో గొడవలకు దారితీస్తున్న యని, యువత మద్యం మత్తులో రోడ్లపై వాహనాలను నడుపుతూ ప్రమా దాలకు గురై తమ ప్రాణాలను పొగొట్టుకుంటున్న దుస్థితి నెలకొందని అన్నారు.గ్రామాల్లో యతెచ్ఛగా మద్యం విక్రయాలు కొనసాగుతున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం శోచనీయం అన్నారు.ఇప్పటికైన ఈ విషయంపై ఉన్నత అధికారులు స్పందించి అక్రమమద్యం విక్రయాలను అరిక ట్టాలని అయన కోరారు.ఈ కార్యక్రమంలో షేక్‌రోమన్,ఎండీ సర్తజ్ హుసేన్, ఎండీ షన్వాజ్ హుస్సేన్ సయ్యద్ బాబా,ఎండి ఇబ్రహీం,సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి

**కొడంగల్,జూన్10,ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమంను పాత కొడంగల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థుల ఇంటింటికి తిరుగుతూ బడిబాట కార్యక్రమంను ప్రధానోపాధ్యాయులు క్రాంతికుమార్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 19వ తేది వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలు సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్, నాణ్యమైన విద్యాబోధన,అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, తెలుగు,ఇంగ్లీష్ మీడియంలో ఉచితంగా విద్యాబోధన ఉం టుందన్నారు.బడిఈడు పిల్లలను తమ తల్లిదండ్రులు పనికి పంపించకుండా బాధ్యతగా ప్రభుత్వ పాఠశాలకు పంపించి వారి బంగారు భవిష్యత్తును తీర్చిదిందేందుకు కృషిచేయాలని వారుకోరారు. కార్యక్రమంలో ఆశకార్యకర్త రాధమ్మ పాల్గొన్నారు.

## బిజెవైఎం ఆధ్వర్యంలో సంబరాలు

**కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి శుభాకాంక్షలు**

**తలకొండపల్లి,జూన్10,ప్రభాతవార్త :** కేంద్రంలో నరేంద్ర మోడీ మూడోసారి ప్రధాన మంత్రిగా, మరియు కే ంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లు ఢిల్లోలో ప్రమాణస్వీకారం సందర్భంగా తలకొండపల్లి మండల కేంద్రంలో బిజెపి, బిజెవైఎం, ఎమ్మార్పిఎస్ నాయకులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచి సంతోషంగా సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో బిజెపి బిజెవైఎం నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారులకు సంగీత శిక్షణ పూర్తి

**షాద్‌నగర్, జూన్ 10, (ప్రభాతవార్త) :**

షాద్‌నగర్ పట్టణంలోని పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో చిన్నారులకు నిర్వహిస్తున్న వేసవి సంగీత శిక్షణ తరగతులు సోమవారం ముగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో సంగీత గురువుగా వ్యవహరించిన ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులు తాము నేర్చుకున్న విద్యాను ప్రదర్శించారు. అన్నమాచార్య కీర్తనలు, కీ బోర్డు శిక్షణ, గిటార్, వయోలిన్, డ్రమ్స్ వంటి వాటిల్లో ప్రావీణ్యం పొందిన చిన్నారులు తమ ప్రదర్శనతో చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహకులు ప్రేమ్‌కుమార్ శిక్షణ పూర్తిచేసుకున్నా చిన్నారులకు ప్రశంసపత్రాలను, మెమోంటోలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బండారి రమేష్, కళాకారులు నాగిళ్ల కుమార్, టీవీరంగయ్య, హరీస్‌శర్మ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిను సన్మానిస్తున్న రైతు రక్షణ సమితీ నాయకులు

## 'రైతుభరోసా' సొమ్మును వెంటనే జమచేయాలి

**తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు**

**నర్సాపూర్, జూన్ 10, ప్రభాతవార్త :** ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ పంటలకు పెట్టుబడి నమిత్తం రైతుభరోసా పథకం డబ్బులు తొందరగా రైతుల ఖాతాలో జమచేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు పత్రాల యాదాగౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షులు అక్కమ్మొల్ల మైసయ్యాయాదవ్ కోరారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని రైతు వేదికలో రైతులతో సమావేశమయ్యి రైతుల సమస్యలపై చర్చించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానా కాలం పంటలకు పెట్టుబడి అంటే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం,భూములను సాగుచేయుటకు రైతులకు పెట్టుబడి అవసరమున్నందున తక్షణమే ఈ నెల 20 తేదీలోపు రైతు భరోసా డబ్బులు వారి ఖాతాలో జమచేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పందించి రైతుల ఖాతాలో రైతు భరోసా పథకం డబ్బులు వెంటనే రైతుల కాతాలో జమ చేయాలన్నారు. దీంతో పంటల పెట్టుబడికి రైతులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

**ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని కలిసిన జిల్లా రైతు రక్షణ సమితి నాయకులు**

తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు పత్రాల యాదాగౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షులు అక్కమ్మొల్ల మైసయ్యాయాదవ్ సోమవారం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఈ ప్రాంతంలోని రైతులకేమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని వారు కోరారు. ఈసందర్భంగా రైతు రక్షణ సమితీ నాయకులు ఆర్డీవోను శాలూవాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితీ మెదక్ జిల్లా అధ్యక్షులు పత్రాల యాదాగౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షులు అక్కమ్మొల్ల మైసయ్యాయాదవ్ ల తో పాటు జిల్లా ఉపాధ్యక్షులు మాచునూరి శ్రీశైలంయాదవ్, పత్రాల ప్రభుగౌడ్, అర్జున్, మల్లేష్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిజెపి నాయకులు



బిజెపి నాయకుడికి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నేతలు

**నర్సాపూర్ జూన్ 10. ప్రభాతవార్త :** శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన బిజెపి పార్టీ నాయకుడు దాసరి కృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరారు.సోమవారం నార్సపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి ల సమక్షంలో పిల్లుట్ల గ్రామానికి చెందిన బిజెపి నాయకులు దాసరి కృష్ణ బిజెపి పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి లు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి నాయకురాలు చిలుముల సుహాసినిరెడ్డి,కరుణాకర్‌రెడ్డి, ప్రముఖ సంఘ సేవ అవార్డుగ్రహీత గంగాధర్, నర్సాపూర్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఉదయ్‌కుమార్, నాయకులు కృష్ణ, మురళీగౌడ్, సతీష్ పాల్గొన్నారు.

## కుక్కలదాడి నుండి జింకను కాపాడిన గ్రామస్తులు

**బొంరాస్‌పేట్, జూన్10,ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలం పాలబావితాం డలో సోమవారం ఉదయం సమయంలో కుక్కల ఒక జింకను వెంటాడు తున్న సమయంలో అది గమనించిన గ్రామస్తులు కుక్కల దాడి నుండి జింకను కాపాడటం జరిగిందని ఎల్ఎచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సూర్యానాయక్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడి చెట్టుతాండ గ్రామపంచా యతీకి అనుబంధంగా ఉన్న పాలబావితాండలో ఉదయం సమయంలో కుక్కలు ఒక జింకను వెంటాడుతున్న సమయంలో గ్రామస్తులు గమనించి కుక్కలదాడిలో గాయాలు కావడంతో జింకను తాండకు తీసుకువచ్చి గాయా లను పరిశీలించి దానిని కొడంగల్ ఫారెస్టు అధికారులకు సమాచారం అందిం చిన అనంతరం బులెరో వాహనంలో జింకను కొడంగల్‌లోని పశువుల ఆసుపత్రికి తీసుకువెళ్ళి చికిత్స అందించారు.చికిత్స అనంతరం ఫారెస్టు అధి కారులకు జింకను అప్పచెప్పడం జరిగిందని సూర్యానాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజునాయక్,అరుణ్‌నాయక్,శ్రీనునాయక్, చందర్‌నాయక్, పునిబాయి, రమేష్‌నాయక్,దన్నునాయక్,మల్లేష్,విజేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి మృతికి మౌనంపాటించిన సిబ్బంది

**బొంరాస్‌పేట్,జూన్10,ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలం దేవులా నాయక్ తాండకు చెందిన పంచాయతీ కార్యదర్శి సుమిత్ర ఆదివారం రోడ్డు ప్రమా దంలో మృతిచెందంతో మండల పరిషత్ కార్యలయం సిబ్బంది ఇంచార్జీ ఎంపిడిఓ వెంకన్నగౌడ్,ఎంపిఓ మహేష్‌కుమార్,పంచాయతీ కార్యదర్శులు సుమిత్ర చిత్రప టంకు పూలమాలవేసి ఆమే ఆత్మకు శాంతిచేకురాలని మౌనంపాటించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సిద్ధయ్య, వసంత్‌రెడ్డి, సూర్యప్రకాశ్, నరేందర్,శ్రీనివాస్,రాజేష్, భీమాశం కర్, కృష్ణచైతన్యరెడ్డి, పకిరయ్యగౌడ్,ప్రభాకర్, కంప్యూటర్ సిబ్బంది సతీష్, రాజు, రాఘుపతి,హన్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**బొంరాస్‌పేట్,జూన్10,ప్రభావార్త :** దుద్యాల్ మండల పరిధిలోని దుద్యాల్, లగచర్ల,హకీంపేట్,పోలేపల్లి,గ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు కొడంగల్ నియోజకవర్గం కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ దానయ్య చెతులమీదుగా 40 మందికి చెక్కులను అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ ద్వార నిరుపేద కుటుంబాల మహిళాలకు పెళ్లికానుకగా ప్రభుత్వం ఆర్ధికసహా యం చేయడంతో కొండంతఅండ అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ రవీందర్‌చారి, దుద్యాల్ మండల నాయకులు, కార్యకర్తలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గ్రామ కంఠం భూమి కబ్జా కాకుండా చూడాలి

**కేశంపేట,జూన్ 10, ప్రభాతవార్త** గ్రామ కంఠం భూములు కూడా కబ్జాకు గురవుతున్నాయన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు కూడా అక్రమార్కులకు అండగా ఉండడంతో వారు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. గ్రామకంఠం భూమిని తన సొంత పొలంగా చెప్పుకుని యథేచ్ఛగా అక్రమించిన ఘటనలు మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో కేశవరం మురళీ ఉత్తర దిక్కున ఉన్న గ్రామ కంఠం పొలాన్ని తనకు సంబంధించిన వ్యవసాయ పొలంగా కబ్జా చేశాడంటూ గ్రామస్తులు సోమవారం రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విషయమై అతనితో మాట్లాడగా తన సొంత పొలం అంటూ చెబుతున్నాడని ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి కబ్జా అయిన భూమిని గ్రామానికి అప్పజెప్పాల్సిందిగా కోరుతున్నారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

**కొందుర్గు, జూన్ 10, (ప్రభాతవార్త) :** మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 12వ తేది బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ అధ్యక్షుడు పోతురాజు జంగయ్య అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ డాక్టర్ ఆంజనేయులు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అథితులుగా ఎమ్మెల్యే కె.శంకరయ్య, జడ్పీటీసీ రాగమ్మలు ముఖ్యఅ తిథులుగా పాల్గొంటున్నారని ఆయన వివరించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, జూన్ 9,ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో పురాతన పాఠశాలల భవనాల స్థానంలో నూతన భవన నిర్మాణాలకు కృషి చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి పనుల్లో కార్పోరేట్ సంస్థల భాగస్వామ్యం పెరగాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి గ్లాండ్ ఫార్మ పరిశ్రమ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ పరిధిలోన డిఎన్ కాలనీలో ప్రభుత్వ పాఠశాల నూతన భవన నిర్మాణ పనులకు సోమవారం స్థానిక ప్రజాప్రనిధులతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో గ్రాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో రెండు కోట్ల రుపాయల అంచనాలతో నూతన భవన నిర్మాణా పనులను ప్రారంభించడం జరిగందని తెలిపారు. విద్యారంగం అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతో పాటు, 1100కు పైగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించడం జరిగిందని తెలిపారు. పటాన్‌చెరులో కేజి నుండి పీజి వరకు ప్రభుత్వ విద్యా సంస్థను ఏర్పాటు చేసి ఎడ్యుకేషనల్ హబ్‌గా తిర్చిదిద్దామని తెలిపారు. తల్లితండ్రులు నాణ్యమైన విద్య కోసం తమ పిల్లలను ప్రభుత్వపాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ, వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సుప్రజా వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్, మాజీ సర్పంచి ఉపేందర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కుమార్‌గౌడ్, గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సిఎస్ఆర్ హెడ్ రఘురమన్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు రామక్రిష్ణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



నూతన ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్



జనసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## మాదిగా జనసభ పోస్టర్ ఆవిష్కరణ

**నారాయణఖేడ్, జూన్ 10 ప్రభాతవార్త:** మాదిగా జనసభ పోస్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి ఆదివారం సాయంత్రం పట్టణంలోని స్వగృహంలో ఆవిష్కరించారు. జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడపర్తి రవి తలపెట్టిన మాదిగల జనసభ ఈనెల 15న నారాయణఖేడ్‌లోని మున్సిఫ్ కోర్టు వెనక ఎస్సీ కాలనీలో నిర్వహించడం జరుగుతుందని మాదిగా జేఏసీ నియోజకవర్గ ఇంఛార్జి పైగిడిపల్లి రమేష్ తెలిపారు. మాదిడల ఆస్తితత్వం కోసం జరిపే ఈ పోరాటంలో నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మాదిగా యువతీ యువకులు, మేధావులు, రాజకీయ నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్‌సేట్, ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ బి.నర్సింలు, సద్దాం, నాయకులు ఎం.మనోహర్, కిరణ్ కుమార్, సుకుమార్, రాములు, మోసేస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఐఎం ఎంపి అసదుద్దీన్‌ను కలిసిన న్యాయవాది



అసదుద్దీన్‌కు పూల బోకేను అందజేస్తున్న ఎంఐఎం తాలుకా అధ్యక్షుడు, న్యాయవాది మోహిద్‌పటేల్

**నారాయణఖేడ్, జూన్ 10 ప్రభాతవార్త:** హైదరాబాద్ ఎంపీగా ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందిన ఎంఐఎం అధినేత బారిస్టర్ అసదుద్దీన్‌ను సోమవారం హైదరాబాద్‌లో దారుస్సలాం ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ఎంఐఎం నారాయణఖేడ్ తాలుకా అధ్యక్షుడు, న్యాయవాది మోహిద్‌పటేల్ మార్యాదపూర్వకంగా కలిసి పూలబోకే అందజేశారు. అనంతరం పూలమాల శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మోహిద్‌పటేల్ మాట్లాడుతూ హైదరాబాద్ ఎంపీగా వరుసగా ఐదుసార్లు విజయం సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం ప్రధాన కార్యదర్శి మహ్మద్ మజార్, నాయకులు అబ్దుల్ జబ్బార్, షేక్‌అహ్మద్ పాల్గొన్నారు.

## అభివృద్ధిపై అధికారులతో సమీక్షించిన కార్పొరేటర్



అభివృద్ధిపనులపై అధికారులతో సమీక్షిస్తున్న సింధూ ఆదర్శరెడ్డి

**రామచంద్రాపురం, జూన్ 10, ప్రభాతవార్త:** భారతినగర్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న, కొనసాగాల్సిన అభివృద్ధిపనులపై కార్పొరేటర్ సింధూ ఆదర్శరెడి సోమవారం డివిజన్ వార్డు కార్యాలయంలో వార్డు సిబ్బందితో సమీక్షించారు. ఎల్ఐజికాలనీలో మంజూరైన రోడ్డు త్వరగా ప్రారంభించాలని ఏఈని కార్పొరేటర్ ఆదేశించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్ల ప్రాధాన్యతను అనుసరించి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందన్నారు. అలాగే బిగించిన విద్యుత్ స్థంభాలకు లైట్లు అమర్చాలని సూచించారు. కాలనీలో పారిశుధ్యంపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ఉండాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. వర్షాకాలం సమీపించినందున మాన్సూన్, ఎంతమోలజీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, తమకు అం దిన ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు అధికారి రమేష్, ఇంజనీరింగ్ ఏఈ చంద్రశేఖర్, శానిటరీ సిబ్బంది అనిల్, ఇజాజ్, ఎల్ఐజి కాలనీ అధ్యక్షులు యాదగిరి రెడ్డి, డైరెక్టర్లు లక్ష్మణ్, రాంబాబు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించేందుకు సహకరించండి : కార్పొరేటర్



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూన్ 10, ప్రభాతవార్త:** సందేమార్కెట్ శ్రీనివాస్ నగర్‌కాలనీలోని వార్డుకార్యాలయంలో అధికారులతో కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ అభివృద్ధి పనులపై సమీక్షించారు. ప్రజాసమస్యలు పరిష్కరించే విధంగా సహాయ సహకారాలు అందించాలని డిప్యూటీ కమిషనర్ సురేష్, అధికారులకు సూచించారు. సండే మార్కెట్ వద్ద మావీన్‌గౌడ్ గల్లీలో, మయూరి నగర్ సిసి రోడ్డు పనులు, 13 బ్లాక్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులు, బాలవిహార్ పార్కు, అశోక్‌నగర్ ఓపెన్ డ్రైన్ మంజూరైనా ఇంకా పనులు ప్రారంభం కాలేదని, అందుకు ఇంజనీరింగ్ డీఈ నరేందర్, ఏఈ ప్రభు చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులు త్వరగా ప్రారంభించి పూర్తయ్యేలా చూడాలని, లేకుంటే వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులుపడాల్సి వస్తుందన్నారు. అలాగే ఖాళీ స్థలంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటున్న శానిటేషన్ డిప్యూటీ కమిషనర్ సురేష్, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు బృందితో చర్యలు తీసుకోవ డంపట్ల కార్పొరేటర్ అభినందించారు. వర్షాకాలంలో మాన్‌సూన్ వ్యాధులకు ప్రజలు గురికాకుండా ఎంతమోజి శాఖ చర్యలు తీసుకోవాలని ఎంతమలోజి ఏఈ శంకర్, సూపర్‌వైజర్ మల్లికార్జున్‌లను ఆదేశించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేలా సిబ్బందికి దిశానిర్దేశం చేయాలని జల మండలి డిజీఎం శివకృష్ణ, మేనేజర్ జనార్ధన్‌లకు సూచించారు. అదేవిధంగా విద్యుత్ సమస్యలు రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఏడుపాయల ఈఓగా వినోద్‌రెడ్డి

**పాపన్నపేట, జూన్ 10, ప్రభాతవార్త:**

ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ ఈఓగా వినోద్‌రెడ్డిని నియమించడంతో సోమవారం సాయం త్రం ఏడుపాయల దేఆదాయ శాఖ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకు ఆలయ ఈఓగా సేవలు అందించిన మోహన్‌రెడ్డి పదవీ విమరణ పొందిన విషయం పాఠకులకు విధితమే. వినోద్‌రెడ్డి ఇప్పటివరకు సికింద్రాబాద్‌లోని వినాయక ఆలయం ఈఓగా విధులు నిర్వహించారు.

## రేపు పట్టణంలో తైబజార్ వేలం

**చిన్నశంకరంపేట, జూన్ 10,ప్రభాతవార్త:**

పట్టణంలో తై బజార్ వేలాన్ని బుధవారం ఉదయం 9:30 నిమిషాలకు పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఈవో సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలంటే 10 వేల రుపాయలను డిపాజిట్‌గా చెల్లించాలని చెప్పారు. వేలంలో తై బజారును దిక్కించుకన్న వ్యక్తి వేలం పాటలోని 50 శాతం డబ్బులను వెంటనే చెల్లించాలని, మిగిలిన డబ్బులను రెండు నెలల్లో చెల్లించాలని ఆయన తెలిపారు.

# 'కార్పొరేట్' తరహాలో దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి

### ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి

**దుబ్బాక (అక్బర్‌పేట భూంపల్లి), జూన్ 10, ప్రభాతవార్త:** కార్పొరేట్ ఆసుపత్రి తరహాలో దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో అధిక సంఖ్యలో సిబ్బంది, అన్ని రకాల వసతులు, పేరుగాంచిన డాక్టర్లు ఉన్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాక పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ హేమ్‌రాజ్‌సింగ్ ఆధ్వర్యంలో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దుబ్బాక ప్రజలందరికీ కార్పొరేట్ తరహాలో మంచి వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నందుకు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్ని రోజులుగా సరైన స్టాఫ్ లేక కొంతవరకు ఇబ్బంది పడ్డాం కానీ ఇప్పుడు నూతన స్టాఫ్‌నర్సుల నియామకంతో దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి నూతన కళ వచ్చిందన్నారు. ఆసుపత్రికి వైద్యానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వచ్చేది వర్షాకాలం కాబట్టి అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు ఎప్పటిక ప్పుడు సలహాలు సూచనలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్, వైద్యాధికారులు వినోద్‌బాబ్‌జీ, కాశీనాథ్, దుబ్బాక ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ హేమ్‌రాజ్‌సింగ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గన్నె వనితభూంరెడ్డి, ఎంపిపి కొత్త పుష్పలతకిషన్‌రెడ్డి, జడ్పీటిసి కడతల రవింధర్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రఘునందన్‌రావు గెలవడంతో శివాలయంలో కుటుంబంతో కలిసి మొక్కులు చెల్లించుకుంటున్న తలారి నర్సింలు

## మొక్కులు చెల్లించుకున్న తలారి నర్సింలు

**రాయపోల్ జూన్ 10 ప్రభాతవార్త :** మెదక్ ఎంపీగా మాధవనేని రఘునందన్‌రావు గెలుపొందితే ప్రజ్ఞాపూర్‌లోని శివాలయంలో 108 కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్న ఉమ్మడి దౌల్తాబాద్,రాయపోల్ మండలాల మాజీ వైస్ ఎంపీపీ తలారి నర్సింలు సోమవారం ప్రజ్ఞాపూర్‌లోని శివాలయంలో కుటుంబంతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల ముందు మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు గెలుపొందితే ప్రజ్ఞాపూర్ శివాలయంలో 108 కొబ్బరికాయలు కొట్టుతానని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. రఘునందన్‌రావు మెదక్ పార్లమెంట్ ప్రజల ఆశీర్వాదంతో చల్లగా ఉండాలని దేవున్ని కోరుకున్నట్లు తెలిపారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎంపీ రఘునందన్‌రావు 20 ఎండ్ల పాటు తిరుగులేని నాయకుడుగా ఎదగాలని దువుడ్ని కోరుకున్నట్లు తెలిపారు. ఎంపీ రఘునందన్ రావుపై తలాని నర్సింలుకి ఉన్న అభిమానాన్ని చూసి దౌల్తాబాద్, రాయపోల్ మండలాల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన



వీడియో కాన్ఫరెన్స్‌లో అవగాహన కార్యక్రమం వీక్షిస్తునన దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 10, ప్రభాతవార్త:** రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు రామాయంపేట మండల వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వీడియో కాన్ఫరెన్స్ విధానంతో నేరుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు,ఉత్తమ వ్యవసాయ పద్ధతులు పాటించిన రైతుల అనుభవాలతో కూడిన ఈ కార్యక్రమం రామాయంపేట రైతు వేదిక నందు ప్రతి మంగళవారం నిర్వహించబడుతుందని వివరించారు. నేడు మంగళవారం నాడు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా అధిక సాంద్రత పద్ధతి విభాగంలో ప్రతి పంట వేయడం, సాంకేతిక అంశాలను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలచే అవగాహన కార్యక్రమం, తదుపరి అధిక సాంద్రత పద్ధతిలో ప్రతి పంట వేసినటువంటి రైతు అనుభవాలను పంచుకోవడంతో పాటుగా సేంద్రీయ పద్ధతి ద్వారా వివిధ పంటలను సాగు చేస్తున్నటువంటి రైతు అనుభవాలను ఈ కార్యక్రమంలో రైతులకు అవగాహన కలిపంచడం జరుగుతుందని తెలిపారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమం మంగళవారం ఉదయం 9 గంటలకు రామాయంపేటలోని రైతు వేదిక నందు నిర్వహించబడుతుందని రాజ్‌నారాయణ తెలిపారు.

## ఉపాధి హామీ పనులకు హద్దులు చూపించాలి

**చిన్నశంకరంపేట, జూన్ 10,ప్రభాతవార్త:** ఉపాది హామీ పనులకు హద్దులను చూపించాలని మండల పరిధి అంబాజీపేట, సంగాయపల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామి కూలీలు అధికారులను కోరారు. ఇరు గ్రామాల మధ్య ఉన్న చెరువు హద్దుల గొడవతో సోమవారం నాడు చేయాల్సిన ఉపాది హామీ పనులు నిలిచిపోయాయి. అంబాజీపేట గ్రామానికి చెందిన ఉపాధి హామి కూలీలు సోమవారం గ్రామ శివారులో ఉన్న పెద్ద చెరువులో మట్టిని తియడానికి వెళ్లారు. చెరువు శివారు సంగాయపల్లి గ్రామం వరకు విస్తరించి ఉండటంతో కూలీలు పనులు చేస్తుండగా సంగాయపల్లి గ్రామస్తులు అడ్డుకొని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు అక్కడికి చేరుకొని ఇరు గ్రామాల ప్రజలతో మాట్లాడారు. చెరువు శివారును ఆనుకొని సంగాయపల్లికి చెందిన రైతుల పంట పొలాలు ఉన్నాయని, వాటిలో మట్టిని తిస్తున్నారని, వారు ఆరోపించారు. చెరువులో మట్టిని తీస్తే అడ్డుకోలేదని వారు తెలిపారు. పంట పోలాల వద్ద హద్దులు నిర్ణయించాకే పనులు చేపట్టాలని, ఉపాధి హామీ సిబ్బందికి రెవెన్యూ అధికారులు సూచించారు.



ఇరు గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు



ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

## ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ

**కంగ్టి, జూన్ 10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సోమవారం వ్యవసాయాధికారి ప్రవీన్‌చారి, ఎఎస్ఐ. నారాయణల ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. అధికారులు దుకాణంలోని సీడ్స్ స్టాక్‌ను, లేబుల్ నెంబర్, డీలర్ సర్టిఫికెట్, ఎన్ని ప్యాకెట్లు దిగుమతి చేసుకున్నారో వివరాలు రిజిస్టర్‌లో బుక్‌లో పొందుపర్చాలన్నారు. రైతులకు ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని తప్పకుండా రైతులకు షాప్‌కు బిల్లులు ఇవ్వాలని రైతు పేరు ఊరు పోన్‌నెం రాసి ఉంచుకోవాలని అన్నారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని లేనిఏడల దుకాణంపై కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులకు మోసం చేస్తే నాన్‌బేల్ కేసులు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

**ఒకే రకంపై మోజు వద్దు...**

కొందరు రైతులు ఒకేరకం(బ్రాండ్) విత్తనాల కోసం ఎగబడుతున్నారు. సంబంధిత కంపెనీవాళ్లు డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఒకే రకం బ్రాండ్ విత్తనానికి అధిక దిగుబడులు వస్తాయనేది కేవలం అపోహ అని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నారు. బీటీ 2లో దాదాపు అన్నిరకాల దిగుబడి సామర్థ్యం ఒకే రకంగా ఉంటుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం క్షేత్రాల పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. విత్తనాల ద్వారా కేవలం కొద్ది శాతం మాత్రమే దిగుబడిపై ప్రభావం ఉంటుందని చెబుతున్నాయి. మిగతా 90 శాతం దిగుబడి రైతులు అచరించే యాజమాన్య పద్ధతులపై ఆధారపడి ఉంటుందని తేల్చాయి. వర్షధారం కింద ఎకరాకు తొమ్మిది క్వింటాళ్లు, నీటి పారుదల కింద 16 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాయి. కార్యక్రమంలో ఫర్టిలైజర్ దుకాణాదారులు పాల్గొన్నారు.

## రశీదు తప్పనిసరి : ఎవో లక్ష్మీ ప్రవీణ్



దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న లక్ష్మీ ప్రవీణ్

**చిన్నశంకరంపేట, జూన్ 10,ప్రభాతవార్త:** ఎరువులు,విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్ తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేటలోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీచేసి, రికార్డులను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు వ్యవసాయ సీజన్ ముగిసేవరకు రశీదులను భద్రపర్చుకోవాలన్నారు. దుకాణాల యజమానులు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, లేనియెడల చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాల నిల్వల వివరాలను బోర్డులపై,రిజిస్టర్‌లలో నమోదు చేయాలని, ఎమ్మార్పి ధరలకే విత్తనాలను విక్రయించాలని ఆయన తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**చిన్నశంకరంపేట, జూన్ 9,ప్రభాతవార్త:** మండల పరిధిలోని చందంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1999 పదవతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఇన్ని సంవత్సరాల తరువతా తరువాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినోకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సరిగ్గా 25 సంవత్సరాల తరువాత వారంత ఒక చోట చేరి నాటి జ్ఞాపకాలను నేమరు వేసుకుంటూ, ఆంనదోత్సహాల మధ్య సమ్మేళనాన్ని నిర్వహించారు. భూమ్‌గారి మధుసుధన్‌గౌడ్, ధన్‌మత్రి, ఎండి.యూనస్, టి.సంతోష్, ఆర్.నర్సింలు ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం విజయవంతంగా నిర్వహించారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

# ఏకగ్రీవంగా బ్రాహ్మణ సమాజం కార్యవర్గం

**జహీరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:**

జహీరాబాద్ బ్రాహ్మణ సేవా సమాజం-సేవా సంస్థ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రాహ్మణ సేవా సమాజం జిల్లా అధ్యక్షులు సురేష్ జోషి ఆధ్వర్యంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉమాచంద్రకాంత్, జిల్లా ముఖ్య సలహాదారు రాధా కృష్ణమూర్తి శర్మల పర్యవేక్షణలో ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాజ్‌కుమార్ దేశ్‌పాండే, బాల్‌చందర్ జోషి, ఉపాధ్యక్షులుగా పుణీత్‌దీక్షిత్, కృష్ణరావు కులకర్ణి, డాక్టర్ వెంకట్ రమణ, గౌరవ సలహాదారులుగా డాక్టర్ శేషు పద్మనాభరావు, శ్యామ్‌రావు కులకర్ణి, మద్రి రమేష్ కులకర్ణి, మాణిక్‌రావు జోషి, సహాయ కార్యదర్శులుగా ఎస్ పరమేశ్వర్ అయ్యర్, విజయ్ కుమార్ కులకర్ణి ప్రచార కార్యదర్శిగా జె శ్రీనివాస్ శాస్త్రి, కార్యక్రమ నిర్వహణ బాధ్యులుగా అనంత్ రావు కులకర్ణి, నారాయణ అయ్యర్, రాఘవేందర్ కులకర్ణి, కార్యవర్గ సభ్యులుగా మురళి అయ్యర్, భగవాన్ కులకర్ణి, వెంకట్ కులకర్ణి, వెంకట్ జోషి, కంచర్ల రాంప్రసాద్, జగదీశ్వర్ కులకర్ణి, వంసత్ రావు, కిరణ్ పురోహిత్, మహేస్‌జోషి, శంకర్‌రావు,



బ్రాహ్మణ సేవా సమాజం నూతన కార్యవర్గం

అనంత్‌రావు కులకర్ణి, రమేష్‌భట్ ఎన్నికయ్యారు.

**మహిళా కార్యవర్గం...**

జహీరాబాద్ మహిళా కార్యవర్గం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సరస్వతి కులకర్ణి, అఖిలా జోషి, కోశాధికారిగా భవాని కులకర్ణి, ఉపాధ్యక్షులుగా నర్మదా దేశ్‌పాండే, గాయత్రి అయ్యర్, మంజులకులకర్ణి, న్యాయ సలహాదారులుగా జె ఉమారాణి, గౌరవసలహాదారులుగా డాక్టర్ సౌమ్య, హేమలత, వరలక్ష్మి, విజయలక్ష్మి, కార్యనిర్వహణ అధికారులుగా కె.కవితజోషి, విజయలక్ష్మి, కార్యదర్శిగా గాయత్రి జోషి, కార్యవర్గ సభ్యులుగా మంగళ అయ్యర్, సువర్ణ, సుధారాణి, శృతి జోషి, పుష్పకులకర్ణి, పుష్పజోషి, మంజులా జోషి, ఆశ కులకర్ణి, వర్ష కులకర్ణి, కవిత జోషి ఎన్నికయ్యారు.



కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బిజెపి నాయకులు ఢిల్లీ వసంత్

## కేంద్ర మంత్రులకు ఢిల్లీ వసంత్ శుభాకాంక్షలు

**జహీరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:** కేంద్ర మంత్రి ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన తెలంగాణకు చెందిన పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్, కె.కిషన్‌రెడ్డిలను బిజెపినాయకులు ఢిల్లీ వసంత్ కలిసి పూలబొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలో జరిగిన కేంద్ర కేబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఢిల్లీ వసంత్ హాజరై ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన యాసో శ్రీపతి నాయక్‌కు సైతం ఢిల్లీ వసంత్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

## సురేశ్‌శెట్కార్‌కు టిపిసిసి పగ్గాలు అప్పగించాలి

**-మనూర్ మాజీ ఎంపిటిసి రవీందర్**

**మనూర్, జూన్ 10, ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేశ్‌కుమార్ శెట్కార్‌కు టిపిసిసి అధ్యక్ష పదవి కట్టబెట్టాలని మాజీఎంపిటిసి సభ్యులు రవీందర్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ పురోగాభివృద్దికి త్యాగాలు చేసిన సురేశ్‌కుమార్ శెట్కార్‌కు రాష్ట్ర బాధ్యతలు అప్పగిస్తే పార్టీ పరుగులు తీయడం తథ్యమన్నారు. సురేశ్ కుమార్ శెట్కార్ డిసిసి అధ్యక్షులుగా చేసిన అనుభవంతో పాటు ఎమ్మెల్యేగా, ఎంపిగా ప్రజలకు సేవలందించిన గుణం ఉందని, అందుకు కాంగ్రెస్ అధిష్టానం సురేశ్‌కుమార్ శెట్కార్‌కు టిపిసిసి అధ్యక్షులూ నియమించాలని రవీందర్ పార్టీ అధిష్టానానికి వినతి చేశారు.

## మొక్కులు చెల్లించుకున్న కాంగ్రెస్ నాయకులు



సిద్దేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

**కంగ్టి, జూన్ 10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సిద్దేశ్వర ఆలయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ జహీరాబాద్ ఎంపీగా సురేష్‌శెట్కార్ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో కాంగ్రెస్ నాయకులు సిద్దేశ్వర దేవాలయంలో మొక్కులు చెల్లించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రారెడ్డి, మనోజ్‌పాటిల్, సంతోష్‌పాట్నా, చెన్‌బసప్ప, రాంరెడ్డి, షేంకు, రాజుసేట్ మొగులప్ప, సిద్దారెడ్డి, మాజర్, శ్రీను, రాజు రాంగోండ, సంతోష్‌రెడ్డి, శివ, నాగరాజు, శివ, కృష్ణ తదితరుల పాల్గొన్నారు.

## కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, జూన్ 10, ప్రభాతవార్త:** విద్యుత్ షాక్‌కు గురై పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కల్హేర్ మండలం కిష్టాపూర్ మొదలకుంట తండాకు చెందిన రామునాయక్‌ను మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. రామునాయక్‌కు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు మాజీ ఎమ్మెల్యే సూచించారు. మాజీ ఎమ్మెల్యే వెంట జడ్పీటిసి సభ్యులు లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పరమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ భాషీద్, కౌన్సిలర్ అభిషేక్ శెట్కార్, కో-ఆప్షన్ సభ్యులు నాయక్, పట్టణ అధ్యక్షులు నగేష్ సెట్, తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ మృతి ఉద్యమానికి తీరని లోటు

**చేర్యాల, జూన్ 10, ప్రభాతవార్త :** చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువేయడంలో శ్రీనివాస్ కీలకపాత్ర పోషించాడని ఆయన మృతి ఉద్యమానికి తీరని లోటని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన మేరిండ్ల శ్రీనివాస్‌గౌడ్ (44) బ్రెన్‌స్టోక్ వచ్చి మృతి చెందడంతో సోమవారం సిపిఐ నాయకులు తన స్వగృహంలో మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈరి భూమయ్య,గూడెపు సుదర్శన్,అమరగొండ మల్లేష్,రాజు,కృష్ణ తదితరులు ఉన్నారు.

## బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి : ఎంఇవో



బడిబాట కార్యక్రమం దృశ్యం

**కొల్చారం, జూన్ 10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో సోమవారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించిన అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సేవలను వివరించారు. ఐదు సంవత్సరాల పైబడిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఇంటింటికీ వెళ్లి వివరించారు. అనంతరం పోతంశెట్టిపల్లి గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బడిబాటలో మండల విద్యాధికారి నీలకంఠం పల్లె నిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

**మూడోసారి ప్రధానిగా మోడీ బాధ్యతలతో.....**

## దామరచెర్వులో బిజెపి సంబురాలు

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 10, ప్రభాతవార్త :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ముచ్చటగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రామాయంపేట మండలం దామరచెరువులో బిజెపి శ్రేణులు టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి రావడం చాలా శుభ పరిమాణమన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ చేపట్టిన సంక్షేమ పథకాలు, మంచి పనులు, అభివృద్ధి, అవినీతి లేని ప్రభుత్వం, ప్రజాపాలన నిర్వహించారన్నారు. అందువల్లనే ప్రజా ఆదరణతో మోడీ ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రి అయ్యారన్నారు. వచ్చే ఐదేండ్లు ఎన్‌డిఏ ప్రభుత్వం భారత్ అభివృద్ధి పథంలో పనిచేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దిలీప్‌కుమార్, సీనియర్ జిల్లా నాయకులు శంకర్, నరేష్, వినయ్, హరికృష్ణ, సాయి, దిలీప్, రాజ్, వేణు, రంజిత జనసేన నాయకులు స్వామి, భాస్కర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచుకుంటున్న బిజెపి శ్రేణులు